మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 9-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 341 Issue: 341

Circulated to Telangana
Published from Jagitial

09 జూన్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:45 తిథి నవమి రా. 2:31ం వరకు తరువాత దశమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పూర్వాభాద్ర ఉ. 9:27 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం ప్రీతి ఉ. 8:15 వరకు కరణం తైతుల మ. 2:59 వరకు గరజి రా. 2:31ం వరకు వర్జ్యం రా. 7:07 నుండి రా. 8:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:21 నుండి ఉ. 9:13 వరకు రా. 11:09 నుండి రా. 11:53 వరకు రాహుకాలం మ. 3:30 నుండి సా. 5:08 వరకు యమగండం ఉ. 9:00 నుండి ఉ. 10:37 వరకు గుళికాకాలం మ. 12:15 నుండి మ. 1:53 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు తె. 4:35 నుండి ఉ. 6:10 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:41 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# 9 మంది కరిగిపోయారు!

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ ప్రమాదం.. చిమ్మిన 1500 డిగ్రీల వేడి ఉక్కు



ఏపీలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఎంఎస్ -2, ఎస్‌టీసీ -3 హీట్ ఎఫ్‌జీలో జరగిన ప్రమాద ఘటనలో 9 మంది అక్కడికక్కడే సజీవ దహనం అయ్యారు. ద్రవ ఉక్కును లిఫ్ట్ చేస్తున్న సమయంలో లాడెల్ నుంచి 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో కూడిన ద్రవ ఉక్కు పెద్ద మొత్తంలో లీకై కింద పడటంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు గాయపడ్డారు. సీసీడీ విభాగంలో పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి.

విశాఖపట్నం, జూన్ 8 (ఈవార్తలు): ప్రమాద ఘటనతో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు అక్కడి నుంచి భయంతో పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ద్రవ ఉక్కును లాడెల్ ద్వారా తీసుకెళ్తున్న సమయంలో తరువాయి 2 వ పేజీలో...



అక్కడికక్కడే సజీవ దహనం




# బీజేపీని ఓడించడం ఈజీనే!

- మనం కలిసి ఉంటేనే బలం
- నాకు మిత్ర పక్షాలు మద్దతివ్వలే
- ఇండియా కూటమి భేటీలో రాహుల్
- టీఎంసీ, వామపక్షాలపై అసహనం
- రెండేళ్లకోసారి భేటీ కావాలని నిర్ణయం
- ఆగస్టు 8న హైదరాబాద్‌లో తుదుపరి భేటీ

బీజేపీని ఓడించడం అంత పెద్ద కష్టమేమీ కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల భేటీకి మొత్తం 23 పార్టీలు హాజరయ్యాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడ్నరీ.. 'ఐకమత్యమే మహాబలం'అనే సందేశం ఇచ్చారు.

న్యూఢిల్లీ: 'కలిసుంటే బలం.. విడిపోతే పతనం' అని ఆయన నొక్కి చెప్పారు. మన ఉమ్మడి ప్రత్యర్థి అయిన బీజేపీ నుంచి ఎదురయ్యే సవాలును తిప్పికొట్టడానికి మిత్రపక్షాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని రాహుల్ గాంధీ హెచ్చరించారు. అలాగే, మిత్రపక్షాలను ఒకరినొకరు కించపరచుకోవద్దని రాహుల్ గాంధీ హెచ్చరించారు. "దేశం, రాజ్యాంగ పరిరక్షణ కోసం" బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దాదాపు 15 నిమిషాల పాటు తరువాయి 2 వ పేజీలో...

# పెళ్లికి ముందు సెక్స్ తప్పేంలే!

## లైంగిక సంబంధం వ్యక్తిత్వానికి మచ్చ కాదు

## తెలంగాణ ట్రైనీ కానిస్టేబుల్ కేసులో సుప్రీం తీర్పు



పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇద్దరు మేజర్ల పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకుంటే దానిని చట్టపరంగా తప్పుగా చూడలేమని పేర్కొంది. కేవలం లైంగిక సంబంధాల ఆధారంగా ఓ వ్యక్తి క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని, అది రాజ్యాంగం వారికి కల్పించిన హక్కు అని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ మేరకు తెలంగాణకు చెందిన తిరుపతి అనే ఓ ట్రైనీ కానిస్టేబుల్‌కు పోస్టింగ్‌ను నిరాకరించడాన్ని జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం తప్పుబట్టింది. ప్రేమలో ఉన్న ప్రతి బంధం వివాహం వరకు వెళ్లకపోవచ్చని, అంతమాత్రాన వారికి నైతికత లేదని ఎలా నిర్ణయిస్తామని వ్యాఖ్యానించింది.

న్యూఢిల్లీ: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి.. 2014లో తనకు పరిచయం ఉన్న ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరక సంబంధం పెట్టుకున్నాడనే ఆరోపణలతో క్రిమినల్ కేసు నమోదయ్యింది. ఈ నేపథ్యంలో అతడి ప్రవర్తన సరిగ్గా లేదంటూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పోస్టింగ్ ఇవ్వడానికి నిరాకరించి, నియమాకాన్ని రద్దుచేసింది. దీంతో అతడు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, ఈ విషయం 2015లో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్నా మని, తన దరఖాస్తు ఫారంలో ఈ కేసు గురించి వెల్లడించినట్టు వివరించాడు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరు పక్షాల వాదనలు విని తిరుపతికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. పరస్పర అంగీకారంతో ఇద్దరు మేజర్లు శారీరక బంధం పెట్టుకుంటే దానిని నేరంగా పరిగణించలే మని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమ బంధం పెళ్లి వరకు వెళ్లకపోవచ్చని కోర్టు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,169 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,410 |



# గద్వాల జిల్లాలోకి నైరుతి

## తెలంగాణను తాకిన రుతుపవనాలు

## 2-3 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): తెలంగాణకు గుడ్ న్యూస్. నైరుతి రుతుపవనాలు సోమవారం రాష్ట్రాన్ని తాకాయి. గద్వాల జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల రాకతో వర్షాకాలం ప్రారంభమైందని భావిస్తాం. ఇప్పటికే ఇవి కేరళ, తమిళనాడు, కర్ణాటకలో పూర్తిగా విస్తరించాయి. ఏపీ, మహారాష్ట్రలో 30 శాతం తరువాయి 2 వ పేజీలో...

# భరణం చెల్లించలేక భర్త ఆత్మహత్య

## పెళ్లైన రెండేళ్లకే విడాకులు.. హైదరాబాద్‌లో ఘోర విషాదం



హైదరాబాద్‌లో తీవ్ర విషాదకర ఘటన చోటు చేసుకుంది. వరకట్నం కేసు సెటిల్‌మెంట్ కోసం డబ్బులు లేక ఓ భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపుతోంది. పెళ్లి చేసుకున్న రెండు సంవత్సరాలకే వారి మధ్య తీవ్ర దూరం పెరిగిపోయింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్న చిన్న గొడవలు.. చివరికి వారు విడిపోయేందుకు కారణం అయ్యాయి. అయితే వారిద్దరికీ నచ్చజెప్పి.. వారిని కలపాలని పెద్ద మనుషులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. దీంతో వారు విడిపోవడానికే నిర్ణయించుకున్నారు.

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): ఈ క్రమంలోనే విడాకుల సమయంలో భార్యకు భరణం ఇవ్వాలని పెద్ద మనుషులు నిర్ణయించగా.. ఆ డబ్బులు భర్త వద్ద లేవు. ఆ డబ్బు కోసం అప్పు తీసుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో.. అతడు ప్రాణాలు తీసుకున్నాడు. హైదరాబాద్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. చెంగిచెర్ల ఎంఎల్ఆర్ కాలనీకి చెందిన రసూల్ జాకబ్ అనే యువకుడికి.. అల్వాల్ ప్రాంతానికి చెందిన మేఘనతో 2024లో పెళ్లి జరిగింది. వివాహం తర్వాత కొన్ని రోజులు వారిద్దరూ బాగానే ఉన్నా,అనంతరం భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈ క్రమంలోనే కొన్ని రోజులకు -2 వ పేజీలో...

## విశ్వవాణి



చైనాలోని షియామెన్‌కు చెందిన ఓ మహిళ ఒక ఉదయం నిద్రలేచినప్పుడు తన ప్రియుడి స్వరం వినిపించకపోవడంతో ఆశ్చర్యానికి గురైంది. కారణం ఏమిటంటే, ఆమెకు పురుషుల గొంతు వినిపించని అరుదైన వినికిడి సమస్య ఏర్పడింది. వైద్యులు ఆమెకు 'రివర్స్ స్లోప్ హియరింగ్ లాస్' అనే అరుదైన వినికిడి లోపం ఉందని నిర్ధారించారు. అంటే.. తక్కువ ఫ్రీక్వెన్సీ శబ్దాలు వినిపించవు. మహిళల గొంతు ఫ్రీక్వెన్సీ అధికంగా ఉండటం వల్ల వాళ్ల స్వరాలు వినిపించినా, పురుషుల గొంతులు, ఉరుములు లేదా సంగీత స్వరాలు వినిపించలేదు. ప్రతి 12,000 మందిలో ఇలాంటి సమస్య ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

# ఆరుగురు భారతీయ కార్మికులు దుర్మరణం

## దుబాయ్‌లో ట్రక్కును ఢీకొట్టి మినీబస్సు

బ్రేక్ డౌన్ కావడంతో హఠాత్తుగా ఆగిపోయిన ట్రక్కు.. వెనుక నుంచి వచ్చి ఢీకొట్టిన మినీ బస్సు



దుబాయ్: దుబాయ్‌లో సోమవారం ఘోర రోడ్డుపై ప్రమాదం సంభవించింది. రోడ్డు మధ్యలో హఠాత్తుగా ఆగిపోయిన ట్రక్కు.. వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు భారతీయులు సహా 8 మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. దుర్ఘటనపై దుబాయ్‌లోని భారత కాన్సులేట్ ఎక్స్‌లో స్పందించింది. 'దుబాయ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు భారతీయ కార్మికులు చనిపోవడం బాధాకరం.. ఈ క్లిష్ట సమయంలో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు మా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాం' -2 వ పేజీలో...

# భారతీయ నౌకపై దాడి




## హర్మూజ్ సమీపంలో ఘటన

## నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది

## అప్రమత్తమై కాపాడిన నేవీ

టెహ్రాన్: పశ్చిమాసియాలో మరోసారి ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా.. ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌పై సోమవారం దాడి చోటుచేసుకుంది. విదేశీ జెండా కలిగిన 'మారివెక్స్' అనే చమురు ట్యాంకర్‌లో 24 మంది భారతీయ నావికులు ఉన్నారని, కాల్పుల వల్ల అగ్నిప్రమాదం జరిగినట్లు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొంది. మడగాస్కర్ జెండా కలిగిన ఈ నౌకలో - 2 వ పేజీలో...



## తొలితరం ఉద్యమకారుడు

# నర్సింహారెడ్డి కన్నుమూత

జగిత్యాల, జూన్ 8 (ఈవార్తలు) : తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు, విద్యావేత్త, ప్రముఖ రచయిత మదుగంటి వెంకట నర్సింహారెడ్డి (87) కన్నుమూశారు. వయసు రీత్యా కొద్దినెలలుగా ఇంటికే పరిమితమైన ఆయన, సోమవారం జగిత్యాలలోని ఆయన నివాసంలో తుదిశ్వాసం విడిచారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

8.6.2026

మేషం: ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. పనులు చకచకా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధిగమిస్తారు.

వృషభం: ప్రయాణాల మధ్యలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. వృధా ఖర్చులు పెరుగుతాయి. దైవచింతన కలుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలు అంతగా అనుకూలించవు. వ్యాపారాలు అధిక కష్టంతో అల్ప ఫలితాన్ని పొందుతారు.

మిధునం: బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. గృహమున బాధ్యతలు చికాకు పరుస్తాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వ్యాపారమున ఆలోచించి ముందుకు సాగడం మంచిది. ఉద్యోగాలు కొంత గందరగోళంగా ఉంటాయి.

కర్కాటకం: ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. ఎంతటి వారినైనా మీ మాట తీరుతో ఆకట్టుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తొలగుతాయి. వ్యాపార వ్యవహారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగులకు అధికారుల అండదండలు లభిస్తాయి.

సింహం: ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

కన్య: నూతన ఉద్యోగ యోగం ఉన్నది. కుటుంబ విషయంలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగాలలో ఆశించిన స్థానచలనాలు కలుగుతాయి.

తుల: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. మిత్రుల నుంచి ఋణ ఒత్తిడి అధికమవుతుంది. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు గందరగోళంగా సాగుతాయి.

వృశ్చికం: ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. అధిక శ్రమతో కానీ పనులు పూర్తి కావు. స్వల్ప అనారోగ్య సమస్యలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి.

ధనస్సు: సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రులతో సఖ్యత నెలకొంటుంది. ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి.

మకరం: వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. బంధువుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. ఉద్యోగాలలో శ్రమ మరింత అధికం అవుతుంది.

కుంభం: బంధువుల నుండి అందిన శుభవార్తలు ఉత్సాహాన్నిస్తాయి. సోదరులతో భూవివాదాలు కొలిక్కి వస్తాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

మీనం: నూతన ఋణ యత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టకపోవడం మంచిది. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.





# 9 మంది కరిగిపోయారు!

వైర్లు తెగిపోయి ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనతో స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు. ఘటనపై ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూడాలని ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు, ఉద్యోగం

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఉద్యోగి కుటుంబానికి చట్టబద్ధమైన అన్ని టెర్మినల్ బెనిఫిట్స్‌తో పాటు రూ.25 లక్షల ప్రత్యేక ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపింది. తీవ్రంగా గాయపడిన ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. గాయపడిన వారందరి వైద్య చికిత్స ఖర్చులను పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేసింది. మరోవైపు, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలు ప్రస్తుతం నివసిస్తున్న స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో ఉద్యోగి పదవీ విరమణ తేదీ వరకు కొనసాగేందుకు ప్రత్యేక అనుమతి ఇచ్చినట్లు తెలిపింది. ఇది ప్రత్యేక మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయమని పేర్కొంది. అదే కేటగిరీలోని మరో క్వార్టర్‌కు మారాలనుకుంటే కూడా అనుమతి ఉంటుందని వెల్లడించింది. ప్రస్తుతం టౌన్‌షిప్ వెలుపల నివసిస్తున్న అర్హత కలిగిన కుటుంబాలకు కూడా అవసరమైతే క్వార్టర్స్ కేటాయిస్తామని తెలిపింది. మృతి చెందిన ఉద్యోగుల పిల్లల విద్యకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ వెల్లడించింది. ఉద్యోగుల పిల్లలకు అందించే అన్ని విద్యా సౌకర్యాలు, ప్రయోజనాలు బాధిత కుటుంబాల పిల్లలకు కూడా యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది.

# బీజేపీని ఓడించడం ఈజీనే!

మొదటి పేజీ తరువాయి

ప్రసంగించిన రాహుల్.. 'ఓట్ చోరీ' సహా కొన్ని అంశాల్లో కూటమిలోని కొన్ని భాగస్వామ్య పార్టీల నుంచి కాంగ్రెస్‌కు సరైన మద్దతు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాల వంటి పార్టీలపై రాహుల్ అసహనం వ్యక్తం చేసినట్టు వర్గాలు తెలిపాయి. ఇక, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన ఆందోళనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలనే ఏకాభిప్రాయానికి వచ్చింది. ఈ లేఖను వీలైనంత త్వరగా ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఇండియా కూటమి భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ఉదహరిస్తూ బీజేపీని 'ఓడించడం కష్టం' కాదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. నిరంతర అంతర్గత కలహాల ద్వారా ప్రతిపక్షం తనను తాను బలహీనపరుచుకోకుండా ఉండాలని ఆయన అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లకే పరిమితమైంది. 2019లో ఆ పార్టీ సొంతంగా 303 స్థానాల్లో గెలిచింది. ఇక, కాంగ్రెస్ 99 స్థానాల్లో గెలిచి, 2019 కంటే (52) మెరుగైన ఫలితాలు సాధించింది. కేంద్రం తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లును ఓడించడానికి ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావడం లోక్‌సభలో ఐక్యతకు తాజా ఉదాహరణ. "2026 ఏప్రిల్ 17న మోదీ ప్రభుత్వ దురుద్దేశపూరిత డీలిమిటేషన్ బిల్లులను ఓడించడానికి మనమందరం ఏకమై లోక్‌సభలో మన ఐక్యతను, సంఘీభావాన్ని చాలా నిర్ణయాత్మకంగా ప్రదర్శించాం. ఇప్పుడు మనం అదే స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలి. తద్వారా మోదీ ప్రభుత్వ దుష్పరిపాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను మనం ఎదుర్కోగలుగుతాం" అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని కూటమి నిర్ణయించుకుంది. తదుపరి సమావేశం ఆగస్టు 8న హైదరాబాద్‌లో జరగనుంది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నెల రోజుల తర్వాత ఇండియా కూటమి పార్టీలు సమావేశమయ్యాయి. ఇక, అసోం, పశ్చిమ్ బెంగాల్‌లో బీజేపీ, కేరళలో కాంగ్రెస్, తమిళనాడు విజయ్ పార్టీ విజయం సాధించాయి.



# భారతీయ నౌకపై దాడి

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి సరుకు లేదని, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని తెలిపింది. 'భారతీయ నావికులు ప్రయాణిస్తున్న ఒక నౌకకు సంబంధించిన సంఘటనపై మా మిషన్ దృష్టి సారించింది. వారి రక్షణ, భద్రత కోసం మేము ఒమన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని పోస్ట్ చేసింది. ఆ దాడితో ఇంజిన్ దెబ్బతిని మంటలు చెలరేగడంతో సిబ్బంది ఎస్ఓఎస్ కాల్ పంపినట్లు తెలిపింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నట్టు భారత నౌకాయాన శాఖ డైరెక్టర్ ఒపేష్ కుమార్ శర్మ ప్రకటించారు. 'భారతీయ నావికులందరూ ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారు. వారి భద్రతను నిర్ధారించడానికి మేము విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని మన భారత రాయబార కార్యాలయాలు, భారత నౌకాదళం, రక్షణ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటున్నాం' అని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత నుంచి ఇప్పటి వరకూ 3,506 మంది భారతీయ నావికులను సురక్షితంగా తీసుకొచ్చామని వివరించారు. గత 96 గంటల్లోనే 32 మంది నావికులను తీసుకొచ్చినట్టు తెలిపారు. అయితే, నౌకలోని పలువురు గాయపడ్డారని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఇండియా భిన్నమైన ప్రకటన చేసింది. ఈ ట్యాంకర్ భారత్‌లోని కర్వార్ పోర్టు నుంచి ఒమన్ దుక్మ్ రేవుకి వెళ్తున్నట్టు ట్రాకర్‌ను బట్టి తెలుస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, హార్మూజ్ జల సంధి సమీపంలోని చమురు బావులను టార్గెట్ చేయడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్‌పై క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులు చేసింది.

# ఆరుగురు భారతీయ కార్మికులు దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

అని పోస్ట్ పెట్టింది. సాధ్యమైనంతగా సహాయ సహకారాలు అందించడానికి తాము స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నామని కాన్సులేట్ తెలిపింది. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి కాన్సులేట్ అధికారులు వెళ్లి కలిసినట్టు పేర్కొంది. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సాంకేతిక లోపం కారణంగా ట్రక్కు రోడ్డు మధ్యలో అకస్మాత్తుగా ఆగిపోయినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని దుబాయ్ పోలీసుల జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాఫిక్ డైరెక్టర్ బ్రిగేడియర్ జుమా సలేం బిన్ సువైదాన్ తెలిపారు. 'బస్సు డ్రైవర్ అజాగ్రత్త, సురక్షిత దూరం పాటించకపోవడంతో ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టాడని ఆరోపణలు ఉన్నాయి' అని ఆయన ప్రకటనలో వెల్లడించారు. ప్రమాదానికి గల అసలు కారణం తెలియరాలేదని, దర్యాప్తు చేపట్టామని సువైదాన్ చెప్పారు.





# పెళ్లికి ముందు సెక్స్ తప్పేంలే!

మొదటి పేజీ తరువాయి

అభిప్రాయపడింది. ఒకే ఒక్క కారణంతో వ్యక్తి ప్రవర్తన, వ్యక్తిత్వంపై నిర్ణయానికి రావడం సరికాదని పేర్కొంది. నైతికత, చట్టం వేర్వేరని.. ఉద్యోగ అర్హతలను వ్యక్తిగత ఇష్టాయిష్టాలు శాసించలేవని ధర్మాసనం వెల్లడించింది. "ప్రతి బంధం పెళ్లి వరకు వెళ్లదు.. అందువల్ల ఒకరు మరొకర్ని మోసం చేశారని నమ్మడానికి అది ఆధారం కాదు" అని జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. గాజుల తిరుపతికి అనుకూలంగా తీర్పు చెప్పిన ధర్మాసనం.. తక్షణమే అతడికి పోస్టింగ్ ఇవ్వాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. అలాగే, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని బోర్డును సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఈ తీర్పుతో క్యారెక్టర్ వెరిఫికేషన్ నిబంధనలపై సరికొత్త చర్చ మొదలైంది.

# భరణం చెల్లించలేక భర్త ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

మేఘన.. జాకబ్, అతడి కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. ఈ క్రమంలోనే పెద్ద మనుషుల సమక్షంలో వారిని కలిపేందుకు ప్రయత్నించగా.. అవన్నీ విఫలం అయ్యాయి. చివరికి డబ్బులు చెల్లించి విడాకులు తీసుకోవాలని ఇరువర్గాలు నిర్ణయించాయి. అయితే విడాకుల తర్వాత భార్యకు సెటిల్‌మెంట్ కోసం డబ్బులు సమకూర్చుకునేందుకు జాకబ్ తీవ్ర ప్రయత్నాలు చేసినా డబ్బు సమకూరలేదు. కుటుంబ పోషణ, సెటిల్‌మెంట్‌కు డబ్బులు లేక, విడాకులు, అప్పు పుట్టకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

# గద్వాల జిల్లాలోకి నైరుతి

మొదటి పేజీ తరువాయి

విస్తరించాయి. కాగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వరకు విస్తరించాయని, ప్రస్తుతం తెలంగాణ దక్షిణ సరిహద్దులోకి ప్రవేశించే స్థితిలో ఉన్నాయని తెలిపింది. చెప్పినట్లే ఇవాళ తెలంగాణలోకి ప్రవేశించాయి. 'పరిస్థితులు అనుకూలంగా ఉంటే.. రుతుపవనాలు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించడానికి కేవలం 2 నుంచి 3 రోజులు చాలు' అని అధికారులు తెలిపారు. అటు.. దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులు, ఉరుములతో కూడిన బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# తొలితరం ఉద్యమకారుడు నర్సింహారెడ్డి కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

తక్కళ్లపల్లికి చెందిన ఎంపీ నర్సింహారెడ్డి.. జగిత్యాల మల్టీపర్పస్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. కరీంనగర్‌లో పీయూసీ కోర్సు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన ఐదేండ్ల తర్వాత తెలంగాణలోని విద్యార్థి సంఘాలను రద్దు చేస్తూ అప్పటి విద్యాశాఖ మంత్రి ఎస్‌పీబీ పట్టాభి రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో తెలంగాణవ్యాప్తంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉద్యమం మొదలుపెట్టారు. విద్యార్థుల ఆ పోరాటమే క్రమంగా తెలంగాణ తొలిదశ పోరాటానికి నాంది అయ్యింది. నర్సింహారెడ్డికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు సంతాపం ప్రకటించారు.

# జీవో 229పై మీ అభిప్రాయమేంటి?

**ప్రభుత్వ సంజాయిషీ కోరిన కోర్టు**


**మీడియా అక్రెడిటేషన్ల జీవోపై హైకోర్టులో వాదనలు**



హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ లకు సంబంధించిన జీవో ఆర్టీ 229 పై దాఖలైన పిటిషన్ పై సోమవారం తెలంగాణ హైకోర్టు లో వాదనలు జరిగాయి. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో నాలుగు జర్నలిస్టు యూనియన్లకు బదులు మూడు యూనియన్లకే ప్రాతినిధ్యం ఇచ్చి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా జీవో 229 ని అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ, ఈ జీవోను రద్దు చేయాలని ఏవీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వచ్చింది. కేసు స్వీకరించిన జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్ లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది, ప్రభుత్వ తరపు న్యాయవాదుల మధ్య వాదలు జరిగాయి. మీడియా అక్రెడిటేషన్ కార్డుల జారీ కోసం ఏర్పాటైన జీవో 252 నిబంధనల ప్రకారం అక్రెడిటేషన్ కమిటీలో నాలుగు యూనియన్ లను తీసుకోవాల్సి ఉండగా,అట్టి నిబంధనలను తుంగలో తొక్కి కేవలం మూడు యూనియన్ లతోనే కమిటీ ఏర్పాటు చేసి అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది రఘు వాదనలు వినిపిస్తూ, జీవో 229 ని రద్దు చేయాలని కోర్టును కోరారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్ లు ప్రభుత్వ తరపు ప్రత్యేక న్యాయవాదిని సంజాయిషీ అడిగారు. ఈ రిట్ పిటిషన్ కు సంబంధించిన ఫైల్ తనకు అందలేదని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదించగా, పిటిషన్ కాపీలు జీపీకి ఇవ్వకుండా కోర్టులో కేసు నెంబర్ నమోదు కావడం అసాధ్యమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న కోర్టు కేసును వాయిదా వేసింది.

# డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ సస్పెన్షన్

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): తెలంగాణ రెవెన్యూ శాఖలో భారీ భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 2013-18 మధ్య హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన సమయంలో రాము నాయక్ పలు అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలన చేస్తుండగా ఈ లీలలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్లో గజం రూ.2 లక్షలకు పైగా పలికే హైకోర్టు సమీపంలోని హౌసింగ్ బోర్డు స్థలాన్ని, గతంలో తొలగించబడిన వర్క్ ఇన్‌స్పెక్టర్ భార్య పేరిట 2018లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. దీనికి సహకరించిన నాటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పైనా విచారణకు ఆదేశించారు. విజయ్‌నగర్ కాలనీ, లక్ష్మిగూడ సహా పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను అక్రమంగా బదిలీ చేసినట్లు రాము నాయక్‌పై 2017 నుంచి కేసులు ఉన్నాయి. ఈ దందాకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించగా, మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని మంత్రి హెచ్చరించారు.



## దివ్యాంగ జర్నలిస్టులకు

# అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి

**జిల్లాల్లో అప్లికేషన్లు వెంటనే ఓకే చేసి అక్రెడిటేషన్లు పంపిణీ చేయాలి**

**మీడియా అకాడమీ ఛైర్మన్‌కు డీజేఎస్ వినతి**

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): దివ్యాంగులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ యాజమాన్యాల కోటాతో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని మీడియా అకాడమి ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని డెస్క్ జర్నలిస్టుల సంఘం (డీజేఎస్) కోరింది. జిల్లాల్లో డెస్క్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ దరఖాస్తులను వెంటనే ఆమోదించి కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సోమవారం డీజేఎస్ అధ్యక్షుడు బాదిని ఉపేందర్ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కార్యవర్గం, పలువురు డెస్క్ జర్నలిస్టులు హైదరాబాద్‌లోని చాపెల్ రోడ్డులో ఉన్న ప్రెస్ అకాడమీ బిల్డింగ్‌లో అకాడమీ ఛైర్మన్‌ను కలిసి డెస్క్ జర్నలిస్టు సమస్యలపై మోమోరాండం సమర్పించారు. ఈ సదర్భంగా దివ్యాంగులైన జర్నలిస్టులకు యాజమాన్యాల కోటాతో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లాల్లో డెస్క్ జర్నలిస్టులు చేసుకున్న దరఖాస్తులను ఆమోదించడంలో డీపీఆర్వోలు ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. జిల్లాల్లో డెస్క్ జర్నలిస్టులకు జిల్లా కేంద్రంగా అదనంగా అక్రెడిటేషన్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవోను అమలు చేయడంలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని దృష్టికి తీసుకెళ్లారు. 15 ఏండ్ల అనుభవం దాటిన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. డీజేఎస్ చేసిన వినతులపై సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్ రెడ్డి.. దివ్యాంగులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జిల్లాల్లో అక్రెడిటేషన్ల ప్రక్రియలో నెలకొన్న ఆలస్యం, జీవో అమలులో నిర్లక్ష్యంలో ఐఅండ్ పీఆర్ అధికారులతో చర్చిస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేఎన్ రాజారామ్, కనపర్తి రమేశ్, గుజ్జుల సత్యప్రసాద్. వి, వెంకటరమణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో ఉన్న ఐఅండ్‌పీఆర్ కమిషనరేట్‌లో రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ సభ్యులకు.. అక్రెడిటేషన్ కార్డులు రాని వారంతా కలిసి ఓ వినతి పత్రం అందజేద్దామని డీజేఎస్ ప్రెసిడెంట్ ఉపేందర్ పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న జర్నలిస్టు మిత్రులు మంగళవారం ఐఅండ్ పీఆర్ కమిషనరేట్ వద్దకు రావాలని కోరారు.

# మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# డీసీపీ రితిరాజ్ సీక్రెట్ ఆపరేషన్

**సివిల్ డ్రెస్సులో పబ్‌కు మహిళా డీసీపీ**

**వ్యభిచారం, మైనర్లకు అనుమతి వంటి ఉల్లంఘనలు గుర్తింపు**

**తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని ఒక ప్రముఖ పబ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిణి నేరుగా రంగంలోకి దిగారు. సివిల్ డ్రెస్సులో వెళ్లి ఆకస్మిక దాడి నిర్వహించి, అక్కడ గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార దందాతో పాటు పలు అక్రమాలను బట్టబయలు చేశారు. ఈ ఘటన కూకట్‌పల్లి ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కూకట్‌పల్లి డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి రితి రాజ్, స్థానిక 'కింగ్స్ అండ్ క్వీన్స్' (క్లబ్ మస్తీ) పబ్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. పబ్‌లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో, ఆమె మొదట స్వయంగా మారువేషంలో వెళ్లి అక్కడి పరిస్థితులను నిర్ధారించుకున్నారు. అనంతరం పోలీసు బృందంతో కలిసి మెరుపు దాడి చేశారు. వివిధ మీడియా కథనాల ప్రకారం, కస్టమర్లను ఆకర్షించడం కోసం పబ్ యాజమాన్యం యువతులను పావులుగా వాడుకుంటూ వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. యువకులతో సదరు మహిళలు పరిచయాలు పెంచుకుని, వారితో చాటింగ్ చేస్తూ పబ్ కు రప్పించడం ఈ ప్లాన్ లో భాగం. వారి ద్వారా కస్టమర్ల నుంచి భారీగా బిల్లులు వసూలు చేస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులు సహా మొత్తం తొమ్మిది మంది పబ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో మరిన్ని నిబంధనలు ఉల్లంఘనలు కూడా వెలుగుచూశాయి. పబ్‌లోకి మైనర్లను అనుమతించడం, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా మద్యం, ఆహారం సరఫరా చేయడం, పోలీసుల నుంచి అవసరమైన నిరభ్యంతర పత్రం లేకపోవడం వంటి అక్రమాలను గుర్తించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత, పీటా చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సదరు పబ్‌పై 2025లో కూడా గతంలో పలు కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

# హరీశ్ రావుకు గరుడ పురాణంలో శిక్ష: యెన్నం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ అగ్రనేతల వైఖరిపై తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎల్పీ మీడియా హాల్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామనడం, మూసీ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న ఇలాంటి ప్రతిపక్షాన్ని తానెప్పుడూ చూడలేదన్నారు. కేవలం మీడియా హెడ్‌లైన్స్ కోసమే కేటీఆర్, హరీశ్ రావు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేసే వారికి గరుడ పురాణంలో శిక్ష ఖరారవుతుందని... హరీశ్ రావు ఆ శిక్ష అనుభవించక తప్పదని వ్యాఖ్యానించారు. 150 మీటర్లకు తుమ్మిడిహెట్టి నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నా నాటి కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు తెలంగాణ నేత విద్యాసాగర్ రావు అక్కడ గవర్నర్‌గా ఉన్నా ఉపయోగించుకోలేదని విమర్శించారు. పదేళ్ల పాలనలో హైదరాబాద్‌కు ఒక్క ఎంజీడీ అదనపు నీటిని కూడా తీసుకురాలేదని, పాలమూరు-రంగారెడ్డి కెనాల్ పనులపై 90 శాతం పూర్తయ్యాయంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీఆర్ బడ్జెట్‌లో సగం కూడా ఖర్చు చేయకుండా 90 శాతం పనులు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. భూబకాసురుల విషయంలో హైడ్రా ఒక హిట్లర్‌లా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# ఎబోలాపై అప్రమత్తంగా ఉన్నాం

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిఘా కట్టుదిట్టం!**

**మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): ప్రపంచాన్ని టెన్షన్ పెడుతున్న ఎబోలా వైరస్ నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో స్క్రీనింగ్, సర్విలెన్స్‌ను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయం నుంచే 21 రోజుల పాటు కఠిన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. విదేశీ ప్రయాణికులతో కమ్యూనికేషన్ సులువుగా ఉండేందుకు ఎయిర్‌పోర్ట్‌లో ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషలు తెలిసిన సిబ్బందిని నియమించాలని మంత్రి సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం హెల్త్, పోలీస్, ఎయిర్‌పోర్ట్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం లేదా తప్పుడు అడ్రస్‌లు ఇచ్చే ప్రయాణికులపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నమోదైన ఇద్దరు అనుమానితులకు ఎబోలా నెగెటివ్ వచ్చిందని, అయితే నిర్ధారణ కోసం మరోసారి నమూనాలను పరీక్షకు పంపామని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశామన్నారు. సీసీఎంబీకి టెస్టింగ్ కిట్లు అందాయని, పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని... కాబట్టి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

# హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదు

**ఎన్నిక నిబంధనలకు విరుద్ధమన్న హైకోర్టు**

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రాజకీయాల్లో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదని స్పష్టం చేస్తూ, అతడిని వెంటనే పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. 2023 అక్టోబర్ ఎన్నికల్లో అమర్‌నాథ్ కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో నాటి అధ్యక్షుడు జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే, జగన్ మోహన్ రావు సమర్పించిన 'శ్రీ చక్ర క్లబ్' పత్రాలు నకిలీవని, ఆ క్లబ్ ఉనికిలోనే లేదని అమర్‌నాథ్ బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో 2018లోనే జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి ఈ క్లబ్ మార్పు చట్టవిరుద్ధమని తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు.

# కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ: డీకే అరుణ

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): పాలమూరు సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఎన్నడూ ఈ ప్రాంత ప్రాజెక్టుల కోసం పోరాడలేదని విమర్శించారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నడిచిన దారిలోనే రేవంత్ సైతం పయనిస్తున్నారని.. ఆ కారణంగా కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పడుతుందని ఆమె హెచ్చరించారు. సీఎం రేవంత్‌కు కేవలం ప్రచార ఆర్భాటాల మీద ఉన్న శ్రద్ధ.. అభివృద్ధిపై లేదని అరుణ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందన్న కాంగ్రెస్ ఆరోపణలను ఆమె పూర్తిగా కొట్టిపారేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలోనే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎందుకు చట్టంలో పెట్టలేదని నిలదీశారు. రాష్ట్ర బీజేపీ నేతలు తప్పించుకు తిరుగుతున్నారని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణ పొలిమేర కూడా దాటనివ్వబోమని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డీకే అరుణ తీవ్రంగా మండిపడ్డారు. "పొలిమేర దాటనీయకపోవడానికి తెలంగాణ ఏమైనా రేవంత్ రెడ్డి జాగీరా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రజల మధ్యకు వెళ్లలేకనే చుట్టూ భారీ సెక్యూరిటీ పెట్టుకుని తిరుగుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో రేవంత్‌నే తెలంగాణ పొలిమేరల్లోకి రాకుండా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ చెబుతున్న అబద్ధాలను గమనిస్తున్నారని అరుణ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వస్తోందని.. అదే సమయంలో బీజేపీకి ప్రజా మద్దతు క్రమంగా పెరుగుతోందని తెలిపారు. తెలంగాణలో తదుపరి తమ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు.

# విద్యాశాఖపై రేవంత్‌కు పట్టులేదు: కవిత

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని టీఆర్ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు.



కాంగ్రెస్ ప్రభుత్వపు ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని ఆమె విమర్శించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన గణాంకాలను వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలతో రాష్ట్రం విద్యా రంగంపై చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది. కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

# ఛత్రపతి 'కాట్రాజ్'పై కేసు

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): టాలీవుడ్ ప్రముఖ నటుడు సుప్రీత్ క్యాబ్ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలతో కేసు నమోదైంది. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడు, ఉబెర్ క్యాబ్ డ్రైవర్ శ్రీహరి అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, వనస్థలిపురం నుంచి కుందన్‌పల్లికి ట్రిప్ పూర్తి చేసిన డ్రైవర్ శ్రీహరి, నాగారం చౌరస్తా వద్ద రోడ్డు పక్కన కారును నిలిపి తదుపరి బుకింగ్ కోసం వేచి చూస్తున్నాడు. అదే సమయంలో ఫార్చ్యూనర్ కారులో అటుగా వచ్చిన నటుడు సుప్రీత్ రెడ్డి, వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా ఎందుకు పెట్టావంటూ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తనను అసభ్య పదజాలంతో దూషించి, భౌతికంగా దాడి చేయడమే కాకుండా తన మొబైల్ ఫోన్‌ను లాక్కున్నారని శ్రీహరి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే బాధితుడు 'డయల్ 100'కు ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సుప్రీత్‌పై కేసు నమోదు చేశారు. 'ఛత్రపతి' చిత్రంలో 'కాట్రాజ్' పాత్రతో గుర్తింపు పొందిన సుప్రీత్, పలు తెలుగు, తమిళ సినిమాల్లో విలన్‌గా నటించారు.

# ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ కోరనేలేదు


**రేవంత్ అబద్ధాలు చెప్తున్నారు: రాంచందర్ రావు**

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఆరోపించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసేందుకు ప్రయత్నించానని రేవంత్ రెడ్డి చెప్పడం పూర్తిగా అవాస్తవమని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ, ఫడ్నవీస్‌తో భేటీ కోసం రేవంత్ రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని, ఈ విషయాన్ని ఫడ్నవీస్ కార్యాలయమే స్పష్టం చేసిందని తెలిపారు. నెల రోజుల క్రితం ఒక మంత్రి (ఉత్తమ్) అపాయింట్‌మెంట్ కోరారని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రే స్వయంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య విభజన రాజకీయాలకు పాల్పడుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ సాధిస్తున్న పురోగతిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ నేతలు స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళన, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే బాధితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ పోరు తీవ్రతరమైన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ప్రజ్ఞానందకు రూ.50 లక్షలు

**తమిళనాడు సీఎం విజయ్ భారీ నజరానా**

చెన్నై: నార్వే చెస్ టోర్నమెంట్‌లో చారిత్రక విజయం సాధించిన యువ చెస్ సంచలనం, గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు రూ. 50 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ప్రజ్ఞానందతో సీఎం విజయ్ కాసేపు సరదాగా చెస్ ఆడి ఆయన్ను ఉత్సాహపరిచారు. ఈ ఆసక్తికర ఘటన అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఓస్లోలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో టైటిల్ గెలిచిన మొట్టమొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. టోర్నీలో భాగంగా ఆయన ప్రపంచ నంబర్ 1, సొంతగడ్డ ఆటగాడైన మాగ్నస్ కార్ల్‌సెన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో రెండుసార్లు గెలిచి అరుదైన ఘనత సాధించాడు. అలాగే, ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై కూడా కీలక విజయం నమోదు చేసి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ వేదికపై దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ప్రజ్ఞానంద మేధస్సును, సంయమనాన్ని సీఎం విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరఫున రూ. 50 లక్షల చెక్కుతో పాటు జ్ఞాపికను సీఎం విజయ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆధవ్ అర్జున, క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి జె. మేఘనాథ రెడ్డి, ప్రజ్ఞానంద తల్లిదండ్రులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూన్ 1న విడుదలైన ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానంద, నార్వే చెస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. టోర్నీలో ఆరో రౌండ్ ముగిసేసరికి చివరి స్థానంలో నిలిచి, అనూహ్యంగా పుంజుకున్నాడు.



## బ్లాక్ హోల్ మిస్టరీ వీడింది!

**పాలపుంత మధ్యలో బ్లాక్‌హోల్ నుంచి గాలులు**

**50 ఏళ్ల అన్వేషణకు దొరికిన కీలక ఆధారం**

న్యూయార్క్: మన పాలపుంత మధ్యలో ఉన్న భారీ కృష్ణబిలం (బ్లాక్‌హోల్) 'సగిటారియస్ ఏ' నుంచి వెలువడుతున్న ఉష్ణ పవనాలను శాస్త్రవేత్తలు తొలిసారిగా గుర్తించారు. దాదాపు 50 ఏళ్లుగా ఖగోళ శాస్త్రవేత్తలకు అంతుచిక్కని ఈ రహస్యాన్ని తాజా పరిశోధన ఛేదించింది. చిలీలోని అటాకామా లార్జ్ మిల్లీమీటర్/సబ్‌మిల్లీమీటర్ అరే రేడియో టెలిస్కోప్ ద్వారా సేకరించిన డేటాతో ఈ కీలక ఆవిష్కరణ చేశారు. నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన ఎలెనా ముర్చికోవా, మార్క్ గోర్స్కి నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. ఐదేళ్ల పాటు సుమారు 100 గంటల పాటు గెలాక్సీ కేంద్రాన్ని పరిశీలించి, కార్బన్ మోనాక్సైడ్ వాయువు కదలికలను మ్యాప్ చేశారు. ఈ ప్రక్రియలో బ్లాక్‌హోల్ నుంచి వెలువడే రేడియో తరంగాలను జాగ్రత్తగా వేరుచేసి, అత్యంత స్పష్టమైన చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో బ్లాక్‌హోల్ చుట్టూ ఉన్న శీతల వాయువులో కోన్ ఆకారంలో ఒక ఖాళీ ప్రదేశం ఉన్నట్లు కనుగొన్నారు. దీని పొడవు సుమారు మూడు కాంతి సంవత్సరాలు ఉంటుందని అంచనా. నాసాకు చెందిన చంద్ర ఎక్స్‌రే అబ్జర్వేటరీ డేటా కూడా ఇదే ప్రాంతంలో వేడి వాయువు నిండి ఉన్నట్లు నిర్ధారించింది. దీనిని బట్టి బ్లాక్‌హోల్ నుంచి వీస్తున్న వేడిగాలులే చుట్టుపక్కల ఉన్న శీతల వాయువును పక్కకు నెడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారణకు వచ్చారు. సాధారణంగా క్రియాశీల బ్లాక్‌హోల్స్ నుంచి శక్తివంతమైన గాలులు వెలువడతాయి. అయితే, మన గెలాక్సీలోని 'సగిటారియస్ ఏ' వంటి నిశ్శబ్ద బ్లాక్‌హోల్స్ నుంచి కూడా ఇలాంటి బలహీనమైన గాలులు వెలువడతాయని ఈ పరిశోధన తొలిసారిగా నిరూపించింది. ఈ గాలులు అంత శక్తివంతమైనవి కాకపోయినా, అవి నక్షత్రాల ఏర్పాటు ప్రక్రియను నెమ్మదింపజేయగలవని పరిశోధకులు తెలిపారు. ఈ గాలుల వేగం, కదలికలపై మరింత స్పష్టత కోసం మరిన్ని పరిశీలనలు అవసరమని వారు పేర్కొన్నారు. ఈ తాజా ఆవిష్కరణ వివరాలను 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురించారు.

## చిన్న కార్లకు గిరాకీ

**పుంజుకుంటున్న హ్యాచ్‌బ్యాక్ మార్కెట్**

ముంబై: భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో గత కొన్నేళ్లుగా ఎస్‌యూవీల హవా నడుస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. మళ్లీ చిన్న కార్లు, అంటే హ్యాచ్‌బ్యాక్‌లు పుంజుకుంటున్నాయి. ముఖ్యంగా మారుతీ సుజుకీ, టాటా మోటార్స్ ఈ మార్పునకు నాయకత్వం వహిస్తున్నాయి. 2026 మే నెల అమ్మకాల గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. చిన్న కార్లకు మళ్లీ డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణం 'ధర'. ఇటీవల కార్ల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో తొలిసారి కారు కొనాలనుకునే వారికి, మధ్యతరగతి కుటుంబాలకు ఎస్‌యూవీలు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో, తక్కువ ధరలో లభించే హ్యాచ్‌బ్యాక్‌లు ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. టైర్-2, టైర్-3 నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన సామర్థ్యం ఉన్న చిన్న కార్లకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. మారుతీ సుజుకీ తన ఎంట్రీ-లెవల్ మోడళ్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. మే నెలలో ఆల్టో, ఎస్-ప్రెస్సో వంటి మోడళ్ల అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. స్విఫ్ట్, వ్యాగన్ ఆర్, బాలెనో వంటి కాంపాక్ట్ కార్లు కూడా స్థిరంగా రాణిస్తున్నాయి. "భారత్‌లో చిన్న కార్లకు ఉజ్వల భవిష్యత్తు ఉంది" అని మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్.సి. భార్గవ ఇటీవల స్పష్టం చేశారు. మరోవైపు, టాటా మోటార్స్ హ్యాచ్‌బ్యాక్‌లకు కొత్త అర్థం చెబుతోంది. ఇటీవల విడుదల చేసిన నెక్స్ట్-జెన్ టియాగో, టియాగో ఈవీ మోడళ్లలో అదిరిపోయే ఫీచర్లను అందిస్తోంది. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్, 360-డిగ్రీ కెమెరా, వైర్‌లెస్ కనెక్టివిటీ వంటి ఫీచర్లతో చిన్న కార్లను కేవలం చౌక వాహనాలుగా కాకుండా, టెక్నాలజీతో నిండిన ఆప్షన్లుగా మారుస్తోంది. మొత్తం మీద, పదేళ్లుగా కొనసాగుతున్న 'ఎస్‌యూవీ' ట్రెండ్‌తో పాటు, మార్కెట్‌ను విస్తరించాలంటే చిన్న కార్లు కూడా తప్పనిసరి అని కంపెనీలు గ్రహించాయి. ఎస్‌యూవీల అమ్మకాలు 50 శాతానికి పైగా ఉన్నప్పటికీ, కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడంలో హ్యాచ్‌బ్యాక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.




## ప్రభుత్వ కాంట్రాక్టులపై మైక్రోసాఫ్ట్ కఠిన నిబంధనలు

న్యూయార్క్: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ జాతీయ భద్రతా సంస్థలతో చేసుకునే కాంట్రాక్టుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మానవ హక్కుల పరిశీలన, సెక్యూరిటీ నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ సైన్యం తమ అజూర్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌ను నిఘా కార్యకలాపాలకు వినియోగించడంపై జరిపిన అంతర్గత విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, జాతీయ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టులకు ఇచ్చే ముందస్తు ఆమోదాలను కట్టుదిట్టం చేయనున్నారు. మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా తమ సేవల వినియోగాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. ముఖ్యంగా, వివాదాస్పద, ప్రమాదకర ప్రాంతాల్లో మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా కఠినమైన అంచనాలను అమలు చేస్తారు. అలాగే, తమ ఉద్యోగులకు విదేశీ ప్రభుత్వాలు జారీ చేసే సెక్యూరిటీ క్లియరెన్స్‌ల నిర్వహణ ప్రక్రియలను కూడా సమీక్షించనున్నట్లు కంపెనీ తెలిపింది. గత ఏడాది గార్డియన్ పత్రికతో పాటు ఇజ్రాయెల్‌కు చెందిన కొన్ని మీడియా సంస్థలు సంచలన కథనాలను ప్రచురించాయి. ఇజ్రాయెల్ సైనిక విభాగం 'యూనిట్ 8200', రోజూ లక్షలాది మంది పాలస్తీనియన్ల ఫోన్ కాల్స్‌ను అడ్డగించి, వాటిని విశ్లేషించేందుకు మైక్రోసాఫ్ట్ అజూర్‌ను వాడుకున్నట్లు ఈ కథనాలు వెల్లడించాయి. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన మైక్రోసాఫ్ట్, తమ సేవా నిబంధనలను ఉల్లంఘించినట్లు నిర్ధారించి, కొన్ని క్లౌడ్, ఏఐ సేవలకు యాక్సెస్‌ను రద్దు చేసింది. ఈ నిఘా కార్యకలాపాల గురించి సీఈఓ సత్య నాదెళ్లతో సహా ఉన్నత యాజమాన్యానికి తెలియదని సమాచారం. మానవ హక్కుల పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకే ఈ సిఫార్సులు చేశామని మైక్రోసాఫ్ట్ తమ విచారణ సారాంశంలో పేర్కొంది. ఐక్యరాజ్యసమితి మార్గదర్శకాలకు కట్టుబడి ఉన్నామని, సామాన్య పౌరులపై సామూహిక నిఘాకు ఉద్దేశించిన టెక్నాలజీని తాము అందించబోమని స్పష్టం చేసింది.

# జూలైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి**



న్యూఢిల్లీ: సుదీర్ఘకాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది. వచ్చే జూలైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరు దేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ.. చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తి స్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జులై మధ్య నాటికి ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలు చేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ, వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరు దేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో.. ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే.. జులై మధ్యకల్లా ఇరు దేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

## ఎన్డీయేకు 20 మంది టీఎంసీ ఎంపీల మద్దతు

**స్పీకర్‌కు లేఖ రాస్తున్నట్లు కకోలి వెల్లడి**

**మమతా బెనర్జీకి బిగ్ షాక్**




కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఢిల్లీలో ఆమె 'ఇండియా' కూటమి అగ్రనేతలతో అత్యవసర సమావేశంలో పాల్గొన్న రోజే.. అటు లోక్‌సభలో ఆమె సొంత పార్టీకి చెందిన ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేశారు. టీఎంసీ పార్టీకి ఉన్న 28 మంది ఎంపీల్లో దాదాపు 20 మంది అధికార ఎన్‌డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. తృణమూల్ లోక్‌సభ చీఫ్ విప్ పదవి నుంచి తనను అకస్మాత్తుగా తొలగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకురాలు కకోలి ఘోష్ దస్తీదార్ ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. దేశ ప్రయోజనాల దృష్ట్యా తమ భవిష్యత్తు రాజకీయ ప్రయాణం ఎన్‌డీయే కూటమితోనే సాగాలని తాము బలంగా నమ్ముతున్నట్లు దస్తీదార్ ప్రకటించారు. తమతో పాటు ఉన్న 20 మంది ఎంపీల సంతకాలతో కూడిన మద్దతు లేఖను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు త్వరలోనే అందజేస్తామని మీడియాకు వెల్లడించారు. మరో రెబెల్ ఎంపీ షర్మిలా సర్కార్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. తాము పార్లమెంట్‌లో 20 మంది ఎంపీలతో ఒక ప్రత్యేక గ్రూప్‌గా ఏర్పడి ఎన్‌డీయేకు మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కొత్త గ్రూప్‌నకు కకోలి ఘోష్ దస్తీదార్ చీఫ్ విప్‌గా, శతాబ్ది రాయ్ డిప్యూటీ లీడర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. మహారాష్ట్రలో శివసేన పార్టీ చీలిపోయిన తరహాలోనే.. ఇప్పుడు బెంగాల్‌లోనూ అదే సీన్ కనిపిస్తోంది. ఇప్పటికే బెంగాల్ అసెంబ్లీలోనూ 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి తామే 'అసలైన తృణమూల్' అని ప్రకటించుకుంటున్న తరుణంలో.. ఇప్పుడు లోక్‌సభలోనూ మెజారిటీ ఎంపీలు చేజారిపోవడం గమనార్హం. ఈ రెబెల్ ఎంపీలంతా సోమవారం ఢిల్లీలోని బీజేపీ సీనియర్ నేత భూపేంద్ర యాదవ్ నివాసంలో ప్రత్యేకంగా సమావేశమై ఈ తిరుగుబాటు వ్యూహానికి తుది రూపాన్ని ఇచ్చినట్లు సమాచారం. మమతా బెనర్జీ ఢిల్లీలో ఏ ప్రాంతంలో అయితే ఇండియా కూటమి భేటీలో పాల్గొన్నారో.. దానికి కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఈ రహస్య సమావేశం జరగడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాకుండా ఉండేందుకు వీలుగా.. మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది ఎంపీలను తమవైపు తిప్పుకోవడంలో రెబెల్ నేతలు సఫలమయ్యారు.

### 700 పాయింట్లు పతనం

ముంబై: పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. సోమవారం ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వెలువడిన ప్రతికూల సంకేతాలకు తోడు ముడిచమురు ధరలు పెరగడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 719.08 పాయింట్లు పతనమై 73,524.26 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 వద్ద స్థిరపడింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగడం, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ సైతం వైమానిక దాడులతో విరుచుకుపడటంతో పశ్చిమ ఆసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు పెరగడం, భారత్ వంటి ముడిచమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలలో ద్రవ్యోల్బణం భయాలను పెంచుతోంది. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం 1.66 శాతం నుంచి 2.88 శాతం వరకు పతనమయ్యాయి. మరోవైపు, ఇరాన్‌కు ప్రయాణాలను నిలిపివేయాలని, అక్కడ ఉన్న భారతీయులు తక్షణమే స్వదేశానికి తిరిగి రావాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఈ అనిశ్చితి కారణంగా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇజ్రాయెల్‌పై దాడులు ఆపేశాం: ఇరాన్

**క్షిపణి దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే నిర్ణయం**

టెహ్రాన్: ఇజ్రాయెల్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌పై చేపట్టిన సైనిక కార్యకలాపాలను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు సోమవారం వెల్లడించింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష క్షిపణి దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బుల్లా స్థావరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా, ఇరాన్ ఆదివారం రాత్రి ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని పలు వ్యూహాత్మక లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దీంతో మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని, ఇరు దేశాలు వెంటనే దాడులు ఆపాలని పిలుపునివ్వడంతో ఉద్రిక్తతలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ దాడులను 'బాధాకరమైన ప్రతిస్పందన'గా అభివర్ణించిన ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయం, ప్రస్తుతానికి తమ ఆపరేషన్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, భవిష్యత్తులో ఇజ్రాయెల్ ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా, ముఖ్యంగా దక్షిణ లెబనాన్‌లో దాడులు కొనసాగించినా మరింత తీవ్రమైన ప్రతిచర్యలు తప్పవని హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై దాడులు నిలిపివేసినట్లు స్పష్టం చేసింది. ఈ పరిణామంతో అంతర్జాతీయ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి. చమురు ధరలు తగ్గగా, స్టాక్ ఫ్యూచర్లు వృద్ధిని నమోదు చేశాయి. గత ఏప్రిల్‌లో కుదిరిన ఒప్పందం తర్వాత ఇరు దేశాల మధ్య ఈ స్థాయిలో ప్రత్యక్ష ఘర్షణ చోటుచేసుకోవడం ఇదే తొలిసారి. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు కనిపిస్తున్నప్పటికీ, ఇరాన్ విధించిన షరతులతో కూడిన వైఖరి వల్ల మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా సద్దుమణగలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఫిలిప్పీన్స్‌లో భూకంపం

**32 మంది దుర్మరణం.. 7.8 తీవ్రతతో ప్రకంపనలు.. 200 మందికి పైగా గాయాలు**



మాసిమ్: దక్షిణ ఫిలిప్పీన్స్‌లో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని నింపింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా కనీసం 32 మంది ప్రాణాలు కోల్పోగా, 200 మందికి పైగా గాయపడ్డారు. వందలాది భవనాలు దెబ్బతినడం, తీర ప్రాంతాలకు కొద్దిసేపు సునామీ హెచ్చరికలు జారీ కావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7:37 గంటలకు మిండనావో ద్వీపంలో భూకంపం సంభవించింది. సారంగాని ప్రావిన్స్‌లోని మాసిమ్‌కు 32 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 33 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు ఫిలిప్పీన్స్ అధికారులు వెల్లడించారు. గత కొన్ని దశాబ్దాల్లో దేశంలో సంభవించిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఇది ఒకటిగా వారు పేర్కొన్నారు. భవనాలు కుప్పకూలడం, శిథిలాలు మీద పడటం మరియు కొండచరియలు విరిగిపడటం వంటి కారణాల వల్ల మరణాల సంఖ్య అధికంగా ఉందని అధికారులు వివరించారు. ముఖ్యంగా జనరల్ శాంటోస్ నగరంలో ఆస్తి, ప్రాణ నష్టం తీవ్రంగా ఉంది. పలు వ్యాపార సముదాయాలు, విద్యా సంస్థలు, రెస్టారెంట్లు ఈ భూకంపం ధాటికి ధ్వంసమయ్యాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన రోజే ఈ విపత్తు సంభవించడంతో ఆందోళన వ్యక్తమైంది. భూకంపం సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణ భయంతో భవనాల నుంచి బయటకు పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలుగుల్లోకి వచ్చాయి. ఈ దుర్ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ప్రభావిత ప్రాంతాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జనరల్ శాంటోస్ విమానాశ్రయంలో విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. భూకంపం సంభవించిన వెంటనే ఫిలిప్పీన్స్‌తో పాటు ఇండోనేషియా, జపాన్‌లోని కొన్ని ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసినా, కొన్ని గంటల తర్వాత వాటిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగి శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## అత్తతో అల్లుడి పెళ్లి

లక్నో: సమాజంలో బంధాలు, బంధుత్వాలకు ఉన్న నైతిక విలువలను ప్రశ్నించేలా ఉత్తర ప్రదేశ్‌లో ఒక విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఒక వ్యక్తి తన అత్తను న్యాయస్థానంలో వివాహం చేసుకోవడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. కాన్పూర్ దేహత్ జిల్లాలోని అక్బర్‌పూర్ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఒక వ్యక్తి తన అత్తతో పూలదండలు మార్చుకుని, కోర్టు ఇచ్చిన వివాహ పత్రాన్ని చూపిస్తున్న వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తాము ఇష్టపూర్వకంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, అందరూ తమను అర్థం చేసుకుని ఆశీర్వదించాలని వారు ఆ వీడియోలో అభ్యర్థించారు. మీడియా కథనాల ప్రకారం, వీరిద్దరి మధ్య గత నాలుగేళ్లుగా రహస్య సంబంధం కొనసాగుతోంది. సదరు వ్యక్తికి గతంలోనే ఈ మహిళ కుమార్తెతో వివాహం జరిగింది. అయితే, కొంతకాలం క్రితం అత్తాఅల్లుడు ఇంటి నుంచి పారిపోయి, ఇప్పుడు న్యాయస్థానం సాక్షిగా ఒక్కటయ్యారు.

## రాహుల్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో పోస్టర్లు

**ఢిల్లీ ప్రధాన కూడళ్లలో వెలిసిన పోస్టర్లు**

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రతిపక్ష ఇండియా కూటమి అత్యంత కీలక సమావేశం జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ప్రధాన కూడళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ పోస్టర్లను ఏర్పాటు చేశారు. రాహుల్ గాంధీకి రాజకీయ నిలకడ లేదని, తాము కాంగ్రెస్ పార్టీపై ఆధారపడబోమంటూ కూటమి నేతలే అంటున్నట్లు ఆ పోస్టర్లలో పేర్కొనడం గమనార్హం. శరద్ పవార్, ఎం.కే. స్టాలిన్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ వంటి కీలక నేతల ఫొటోలతో ఈ వివాదాస్పద పోస్టర్లను ముద్రించారు. మరోవైపు, ఐక్యతను చాటడం, భవిష్యత్తు వ్యూహాలను మార్చుకోవడమే ప్రధాన అజెండాగా ఇండియా కూటమి సమావేశం కొనసాగింది. ఈ భేటీకి కాంగ్రెస్ నుంచి సోనియా గాంధీ, రాహుల్, ఖర్గేలతో పాటు మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ హాజరయ్యారు. ఉద్ధవ్ ఠాకరే వర్చువల్‌గా పాల్గొన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని ప్రాంతీయ పార్టీల ఓటమి, కూటమిలో తలెత్తిన అంతర్గత విభేదాలను సరిచేసుకుంటూ.. బీజేపీని బలంగా ఢీకొట్టేందుకు సరికొత్త వ్యూహాలను సిద్ధం చేయడంపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. అయితే, ఈ కీలక సమావేశానికి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ దూరంగా ఉండటం గమనార్హం. కూటమి నుంచి తప్పుకోవాలనే ఆలోచనతోనే ఈ రెండు పార్టీలు హాజరుకాలేదని తెలుస్తోంది.



## శ్వాసకోశ వ్యాధులకు ఉచితంగా ఔషధం పంపిణీ

జగిత్యాల టౌన్, జూన్ 8 (ఈవార్తలు): మృగశిక కార్తె సందర్భంగా జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో మిరుగు మందు, ఆయుర్వేద ఔషధాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. గత 15 సంవత్సరాల నుంచి ఈ ఔషధాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు ఆలయ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న తెలిపారు. ఈ ఔషధంలో జలుబు, దగ్గు, ఆస్తమా, ఇసినోఫైలియా మొదలైన అలర్జీలను నయం చేసే శక్తి ఉందని ఆయన తెలిపారు. దాదాపు 500 మందికి ఈ ఔషధాన్ని అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ల శంకర్, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్ తదితరులు పాల్గొన్నారు.



## రజక సంఘ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సత్యం

మల్యాల, జూన్ 8 (ఈవార్తలు): మల్యాల మండలం ముత్యంపేటలో నూతనంగా నిర్మించిన రజక సంఘ భవనాన్ని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ ప్రెసిడెంట్ మేడిపెల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అన్ని కులాల అభివృద్ధికి పాటుపడుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, కనీసం 80 సీట్లలో విజయం సాధించి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కార్యకర్తలు, రజక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టులో ఘనంగా జ్యేష్ఠాభిషేకం

మల్యాల, జూన్ 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం జ్యేష్ఠాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పవిత్ర జలాలు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. 108 కలశాలను అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యేష్ఠాభిషేక మహోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంజనారెడ్డి, అర్చకులు అధికారులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్యంపేటలో ఘనంగా పోచమ్మ బోనాలు

మల్యాల, జూన్ 8 (ఈవార్తలు): మల్యాల మండలం ముత్యంపేటలో ఆదివారం పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.



### నూర్ బాషా దూదేకుల సంఘం ఎన్నిక

మల్యాల, జూన్ 8 (ఈవార్తలు): మల్యాల మండలం రామన్నపేట-మద్దుట్ల-పోతారం గ్రామాల నూరుభాషా దూదేకుల సంఘం ఎన్నికల్లో మహ్మద్ సలీమ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా హారిఫ్, క్యాషియర్‌గా భాషా బాయ్, ప్రధాన కార్యదర్శిగా రఫీ, సలహాదారుగా సాహెబ్ హుస్సేన్, అజారుద్దీన్, సభ్యులుగా రషీద్, అబ్దుల్లా, రంజాన్, సలీం, అబ్దుల్ ఎన్నికయ్యారు.

## ముగ్గురు ఏపీ యాత్రికుల మృతి

### బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నెల్లూరు, జూన్ 8 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా నుంచి కాశీకి వెళ్తున్న యాత్రికుల బస్సు బీహార్‌లో ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు జిల్లా సంగం నుంచి జూన్ 1న 43 మంది యాత్రికులతో ఒక ప్రైవేట్ బస్సు కాశీ యాత్రకు బయల్దేరింది. ఆదివారం అర్ధరాత్రి బీహార్ రాష్ట్రంలోని ఔరంగబాద్ సమీపంలో జాతీయ రహదారి-2పై ఈ ప్రమాదం జరిగింది. గయ నుంచి వారణాసికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో వాహనం బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ఎడమ వైపున కూర్చున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు, గాయపడిన వారు నెల్లూరు జిల్లా సంగం, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన వారిగా తెలుస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరాయి రాష్ట్రంలో ప్రమాదానికి గురైన తమను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# మోతె చెరువు ఆక్రమణలు తొలగించాలి

### ఆర్డీవోకు జీవన్‌రెడ్డి వినతి

జగిత్యాల, జూన్ 8 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు నిర్ణయించి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో మధుసూదన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని, ఎక్కడ ఆక్రమణలు జరిగినా వాటిని తొలగించి చెరువులను పునరుద్ధరించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ శివారులోని మోతె చెరువు, ముప్పారపు చెరువు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులను మట్టితో నింపివేయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మత్స్యకారుల జీవనోపాధిపైనా తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. మోతె, ముప్పారపు చెరువుల అంశాన్ని పలుమార్లు జిల్లా కలెక్టర్, రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ముప్పారపు చెరువు, తిమ్మాపూర్, రఘురాములకోట, తిప్పన్నపేట చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు నిర్ణయించి, ఆక్రమణలను తొలగించాలని కోరారు. అలాగే సారంగాపూర్ మండలంలోని నాగులకుంట మత్స్య సహకార సంఘ సభ్యుల జీవనోపాధి చెరువులపైనే ఆధారపడి ఉందని తెలిపారు. నగునూరు కుంటలో మత్స్యకార సంఘం ఏర్పాటు చేసిన షట్టర్లను కొంతకాలం క్రితం తొలగించారని, ఫిర్యాదుల అనంతరం వాటిని పునరుద్ధరించినట్లు చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువులోకి నీరు వచ్చే అవకాశం ఉన్నందున షట్టర్లను రక్షించి, చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని కోరారు. ఎఫ్‌టీఎల్ హద్దులు ఖరారు చేసి చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను విజ్ఞప్తి చేశారు. వినతిపై ఆర్డీవో మధుసూదన్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు జీవన్‌రెడ్డి తెలిపారు.



# ప్రతి కార్యకర్తకు అండగా బీఆర్ఎస్ పార్టీ

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడి

ధర్మపురి, జూన్ 8 (ఈవార్తలు): కార్యకర్తలు, పార్టీ కోసం నిలబడి పోరాడే నాయకులే బీఆర్ఎస్ పార్టీకి అవసరమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అధికారం కోసం పార్టీలు మారే నాయకులకు పార్టీలో స్థానం ఉండదని స్పష్టం చేశారు. సోమవారం ఎస్‌హెచ్ గార్డెన్‌లో నిర్వహించిన జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే నాయకులను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపిస్తూ, వాటికి భయపడవద్దని సూచించారు. పార్టీ లీగల్ సెల్‌తో పాటు తాను కూడా అండగా ఉంటానన్నారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారికి మాత్రమే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచించిందని, వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, కోతలతో రైతులు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. సమావేశంలో మూల విజయరెడ్డి, ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, హరిచరణ్‌రావు, అయ్యోరి రాజేష్, సంగి సత్తెమ్మ, బలరాం రెడ్డి, బండారి రంజిత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇంటర్‌లింక్ వ్యవస్థతో నిరంతరాయ విద్యుత్

జగిత్యాల, జూన్ 8 (ఈవార్తలు): వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు జగిత్యాల సర్కిల్‌లో ఆధునిక ఇంటర్‌లింక్ (అనుసంధాన) లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. ఒక విద్యుత్ లైన్ లేదా సబ్‌స్టేషన్‌లో లోపం ఏర్పడినప్పుడు సరఫరా నిలిచిపోకుండా, మరో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్ అందించే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 33 కేవీ లైన్లను పరస్పరం అనుసంధానం చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర మరమ్మతుల సమయంలో కూడా విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. సర్కిల్ పరిధిలోని 117 సబ్‌స్టేషన్లకు ఇంటర్‌లింకింగ్ లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు, అలాగే 43 విద్యుత్ లైన్ల మధ్య కూడా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీంతో విద్యుత్ సరఫరాలో స్థిరత్వం పెరగడంతో పాటు నిర్వహణ పనులు సులభంగా చేపట్టే అవకాశం కలుగుతోందన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ దశలవారీగా ఇంటర్‌లింక్ వ్యవస్థను విస్తరిస్తున్నామని, వినియోగదారులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు విద్యుత్ శాఖ కృషి చేస్తోందని సుదర్శనం తెలిపారు.



# ఇస్లాంపూర్‌లో స్వచ్ఛతపై అవగాహన

గంగాధర, జూన్ 8 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రభుత్వ ప్రణాళికల అభివృద్ధిలో భాగంగా గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, ప్లాస్టిక్, గాజు సీసాలు తదితర వ్యర్థాలను ఎలా వేరు చేసి గ్రామ సహాయకులకు అందించాలి, వాటి సేకరణ విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజ్ వ్యవస్థ నిర్వహణ, నీరు నిల్వ ఉ ండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ చర్యలు, అలాగే అనవసరంగా పెరిగే చెట్లు, మొక్కలను తొలగించే విధానంపై కూడా వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక గ్రామసభలో సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే గంగాధర మండల్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఉప సర్పంచ్ రవీందర్ గారు, గ్రామ కార్యదర్శి, వివిధ వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని అధికారులు తెలిపారు.





## జర్నలిస్టుల పిల్లలకు 50% రాయితీ ఇవ్వాలి

### ప్రజావాణిలో ఐజేయూ నాయకుల వినతి

### సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్

జగిత్యాల, జూన్ 8 (ఈవార్తలు): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లా జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) ప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపై స్పందించిన అదనపు కలెక్టర్, జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) రాముకు సూచించినట్లు తెలిపారు. సమస్యను వెంటనే పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించడంపై జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అయితే చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న జర్నలిస్టులకు పిల్లల విద్యాభారం తీవ్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వడంలో సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన

### రాఘవపట్నంలో ప్రత్యేక గ్రామసభ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచన

గొల్లపల్లి, జూన్ 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు శాంతిభద్రతలు, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. గ్రామసభలో పాల్గొన్న ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో భద్రత పెంపు కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలు పోలీసులకు సహకరించి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు.

## హోం గార్డ్‌కు ఆత్మీయ వీడ్కోలు

జగిత్యాల, జూన్ 8 (ఈవార్తలు): పోలీస్ శాఖలో హోం గార్డ్‌గా 34 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన వెంకటయ్యకు జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం నిబద్ధతతో విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చిన వెంకటయ్య సేవలను ఎస్పీ కొనియాడారు.



## హామీ ఇచ్చి.. నెరవేర్చిన సర్పంచ్

### మహిళలకు ఉచిత ఆటో ప్రయాణం ప్రారంభం

### ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, జూన్ 8 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో సర్పంచ్ కంటెస్టెడ్ అభ్యర్థి కోల భవాని అరుణ్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత ఆటో ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై మహిళలకు ఉచిత ఆటో ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. గ్రామంలో మహిళలకు రవాణా సౌకర్యం మెరుగుపరచడం, రోజువారీ ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని మహిళలు విద్య, వైద్యం, ఉద్యోగాలు తదితర అవసరాల కోసం ప్రయాణించే సమయంలో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు ఈ ఉచిత ఆటో సర్వీస్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పాటు లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు గ్రామస్థాయిలో మరింతగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం చేపట్టే ప్రతి ప్రయత్నానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మద్దతుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత ఆటో ప్రయాణ సేవను ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు.

## చీరల కోసం వస్తే నిరాశే!

### కొంతమందికే పంపిణీ.. మిగిలిన వారికి నిరీక్షణ

### ప్రజా పాలన వార్డు సభలో మహిళల అసంతృప్తి

జగిత్యాల, జూన్ 8 (ఈవార్తలు): ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతుందనే సమాచారంతో పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు నిరాశతో వెనుదిరిగారు. జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలో ఈ పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమానికి పలు వార్డుల నుంచి మహిళలు ఆధార్ కార్డులతో భారీ సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచే చీరల కోసం వేచి ఉన్న మహిళలకు సభలో తడి చెత్త--పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొంతమందికి మాత్రమే చీరలు పంపిణీ చేయగా, మిగిలిన వారికి మరో రోజు అందజేస్తామని అధికారులు తెలిపినట్లు మహిళలు ఆరోపించారు. దీంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుంచే కార్యక్రమానికి వచ్చిన తమకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. చీరలు అందుతాయనే ఆశతో వచ్చినప్పటికీ ఖాళీ చేతులతో తిరిగి వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు.



## సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన

### రాఘవపట్నంలో ప్రత్యేక గ్రామసభ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచన

గొల్లపల్లి, జూన్ 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు శాంతిభద్రతలు, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. గ్రామసభలో పాల్గొన్న ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో భద్రత పెంపు కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలు పోలీసులకు సహకరించి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు.

## రూ.69 లక్షల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

మెట్‌పల్లి, జూన్ 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మెట్‌పల్లి మండలం, మెట్‌పల్లి పట్టణానికి చెందిన 69 మంది లబ్ధిదారులకు రూ.69,08,004 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని పేర్కొన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్ల విషయంలో కేసీఆర్ ఎల్లప్పుడూ అండగా నిలిచారని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అమలు చేసిన పథకాలు తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు.



లయ్యారి చిత్రం






## స్లమ్ డాగ్ టీజర్.. పూరి మార్క్ యాక్షన్!

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా చేస్తున్న 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' టీజర్ సైలెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఎప్పుడూ గ్లామర్ ప్రపంచం, స్టైలిష్ హీరోల చుట్టూ కథలు రాసుకునే పూరి ఈసారి పూర్తిగా తన రూట్ మార్చి ఒక మురికివాడ బ్యాక్ డ్రాప్ ఎంచుకున్నట్లు అర్థమవుతుంది. పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో ఒకేసారి రాబోతున్న ఈ సినిమా పూరికి ఒక స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ టీజర్ చూశాక అందరూ మాట్లాడుకుంటున్నది విజువల్స్ గురించే. స్లమ్ ఏరియా బ్యాక్ డ్రాప్, చీకటి, వర్షం పడే సీన్స్ తో సినిమా మూడ్ ఏ స్థాయిలో ఉండబోతుందో దర్శకుడు చాలా క్లియర్ గా చూపించాడు. సినిమాటోగ్రఫీ ఆ రస్టిక్ ఫీల్ ను ఎక్కడా ఆర్టిఫిషియల్ గా అనిపించకుండా చాలా న్యాచురల్ గా తెరపైకి తీసుకువచ్చింది. పూరి గత చిత్రాలకు పూర్తిగా భిన్నంగా ఇందులో ఒక సీరియస్ డార్క్ వాతావరణం కనిపిస్తోంది. ఇక ఇందులో విజయ్ సేతుపతి తన రఫ్ లుక్, యాక్షన్ తో ఆకట్టుకున్నాడు. చేతిలో గన్నులు, ఆయుధాలు పట్టుకుని మురికివాడల మధ్య సీరియస్ గా నడిచే సీన్స్ లో అతని స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు బాగా ప్లస్ అయింది. ఒక్క వాన పడితే కాకుల చెట్ల కింద దాక్కునే జీవితాలు.. అంటూ మొదలయ్యే డైలాగ్ పాత పూరి మార్క్ రైటింగ్ ను మనకు గుర్తుచేస్తుంది. పేదల బతుకులతో ఆడుకుంటే వదిలిపెట్టను అంటూ చెప్పే ఎమోషన్ ను కరెక్ట్ గా ఎలివేట్ చేశారు.




## డ్రాగన్ కోసం విదేశీ భామ?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా సినిమా డ్రాగన్ ఇప్పటికే దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో విపరీతమైన అంచనాలను సృష్టిస్తోంది. సినిమా షూటింగ్‌కు సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజా సమాచారం ప్రకారం, డ్రాగన్ లో ఒక ప్రత్యేక మాస్ సాంగ్‌ను ప్లాన్ చేస్తున్నారట. ఈ సాంగ్ కోసం డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఓ విదేశీ నటి లేదా మోడల్‌ను ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు అధికారిక ప్రకటన ఏదీ రాకపోయినా, ఈ వార్త మాత్రం అభిమానుల్లో కొత్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌తో కలిసి స్టెప్పులేయబోయే ఆ ఫారిన్ బ్యూటీ ఎవరనే విషయంపై సోషల్ మీడియాలో ఇప్పటికే అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.

# ఎంఎస్ సుబ్బలక్ష్మిగా రష్మిక!

సంగీత సామ్రాజ్ఞి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ వార్త ఇప్పుడు ఇండస్ట్రీని ఊపేస్తోంది. ఈ సినిమాలో రష్మిక మందన్న లీడ్ రోల్ ప్లే చేయబోతుండటంతో అందరిలోనూ ఆసక్తితో పాటు బోలెడన్ని అనుమానాలు కూడా మొదలయ్యాయి. అయితే, ఈ ప్రతిష్టాత్మక సినిమా కేవలం రష్మిక నటనకు మాత్రమే కాదు.. 'కింగ్డమ్' మూవీ తర్వాత డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి కెరీర్‌కు కూడా ఒక రకమైన అగ్నిపరీక్షే అని చెప్పాలి. రష్మిక మందన్నకు పుష్ప 2, యానిమల్, 'ఛావా' లాంటి సినిమాలతో బాక్సాఫీస్ దగ్గర వందల కోట్ల మార్కెట్ అయితే ఉంది. కానీ ఇప్పటికీ ఆమెను ఒక స్టార్ గ్లామర్ హీరోయిన్‌గానే చూస్తున్నారు తప్ప ఒక గ్రేట్ యాక్ట్రెస్‌గా గుర్తించడం లేదు. అందుకే ఈ బయోపిక్ ఆమె నటనపై ఉన్న విమర్శలను పటాపంచలు చేయడానికి దొరికిన ఒక లైఫ్-చేంజింగ్ గోల్డెన్ ఛాన్స్. మహానటి సినిమా రాకముందు కీర్తి సురేష్ కేవలం కమర్షియల్ సినిమాలు మాత్రమే చేసేది. సావిత్రి గారి పాత్రకు ఆమెను ఎంచుకున్నప్పుడు చాలా మంది విమర్శించారు. కానీ కీర్తి సురేష్ ఆ పాత్రతో నేషనల్ అవార్డు కొట్టి అందరి నోళ్లు మూయించింది. ఇక ఇప్పుడు రష్మిక విషయంలోనూ ప్రేక్షకులు అదే తరహా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెగెటివిటీనే ఛాలెంజ్‌గా తీసుకుని సుబ్బులక్ష్మి గారి హుందాతనాన్ని రష్మిక పండిస్తే.. ఆమె కెరీర్ కూడా ఊహించని మలుపు తిరుగుతుంది.







## బుచ్చిబాబుకు కంగన మద్దతు

సినిమాల్లో మహిళలను కేవలం ఒక వస్తువులా చూపించడంపై కంగనా రనౌత్ స్పందిస్తూ.. తన కెరీర్‌లో తాను ఎదుర్కొన్న అనుభవాలను షేర్ చేసారు. తెరపై తనను ఎవరూ తప్పుగా లేదా అసభ్యంగా చూపించకుండా ఉండేందుకు నటిగా ఎలాంటి హద్దులు గీసుకుంటారనే ప్రశ్నపై కంగన స్పందించారు. ఈ సందర్భంగా కంగన మాట్లాడుతూ.. పరిశ్రమలో ఎవరూ కూడా కావాలని ఒక మహిళను తప్పుగా చూపించాలనే ఉద్దేశంతో సినిమాలు తీయరని అభిప్రాయపడ్డారు. ఒక సినిమా ఒప్పుకున్నప్పుడు అందులో రకరకాల కోణాలు ఉంటాయని.. అందువల్ల కథలో ఏదైనా తప్పుగా అనిపిస్తే దాన్ని సరిదిద్దే అవకాశం నటీమణులకు ఉంటుందని కంగన స్పష్టం చేశారు. దర్శక రచయితల ఆలోచనా విధానాన్ని హైలైట్ చేస్తూ కంగన మరింత క్లారిటీ ఇచ్చారు. --ఒక మహిళగా సినిమాలో ఏదైనా సీన్ తేడాగా ఉంది లేదా సరిగ్గా లేదు అనిపిస్తే... మీ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వారి ముందు పెట్టవచ్చు-- అని అన్నారు. రైటర్స్ రూమ్‌లో కూర్చునే వారు ఎప్పుడూ చెడు ఉద్దేశంతో ఆలోచించరని.. కొన్నిసార్లు తెలియకుండానే అలాంటి సీన్లు పడతాయని కంగన పేర్కొన్నారు.




## భాగ్యశ్రీ పరిస్థితేంటో!

సక్సెస్‌లు లేకపోయినా భాగ్యశ్రీకి అవకాశాలు మాత్రం తగ్గడం లేదు. డైరెక్టర్లు, నిర్మాతలు ఇప్పటికీ ఆమెపై నమ్మకం ఉంచుతున్నారు. ప్రస్తుతం అఖిల్ అక్కినేని హీరోగా రూపొందుతున్న లెనిన్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమా కథలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. అఖిల్ పాత్రలో వచ్చే భావోద్వేగ మార్పులు, యాక్షన్‌కు దారితీసే సంఘటనల వెనుక భాగ్యశ్రీ పాత్రే ప్రధాన కారణమని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ లెనిన్ అనుకున్న స్థాయిలో సక్సెస్ సాధిస్తే అది అఖిల్ కెరీర్‌కే కాకుండా భాగ్యశ్రీ కెరీర్‌కు కూడా పెద్ద మలుపు కావొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే లెనిన్ పై భాగ్యశ్రీ చాలానే ఆశలు పెట్టుకుంది.

## సినిమా లెక్కలు మారిపోయాయ్: శిల్పాశెట్టి

ప్రేక్షకులు థియేటర్లో కూర్చుని సినిమా చూడటం కంటే? కుటుంబమంతా ఓటీటీలో లీనమైపోవడం వంటి కారణాల వల్ల సినిమా నిర్మాణ రంగంలో సరికొత్త ఆర్థిక సమీకరణాలు తెరపైకి వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై సీనియర్ నటి శిల్పా శెట్టి కుంద్రా తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత తరుణంలో చిత్ర నిర్మాతలు థియేట్రికల్ విడుదల విషయంలో మునుపటిలా రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేరని అభి ప్రాయపడ్డారు. సినిమా నిర్మాణ వ్యయం పూర్తిగా మారిపోవడంతో ఇండస్ట్రీ ప్రస్తుతం కొంత స్తబ్ధతను ఎదుర్కొంటోందని విశ్లేషించారు. థియేటర్లలో సినిమాను విడుదల చేసి నష్టపోయే బాధ్యతను మోయడం కంటే నేరుగా ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లతో ఒప్పందాలు చేసుకోవడానికే మేకర్స్ ఎక్కువ మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ విషయంలో తానేమీ నిర్మాతలను తప్పుబట్టడం లేదని ఎందుకంటే ఒక సినిమాను నిర్మించడానికి అయ్యే ఖర్చులు, లాభనష్టాల లెక్కలు ఈ రోజుల్లో భారీగా మారిపోయాయని సమర్థించారు.






# టీమిండియా భారీ విజయం

## అఫ్గాన్‌పై రికార్డు గెలుపు.. 94 ఏళ్ల చరిత్రలో తొలిసారి



**అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్ట్‌లో టీమిండియా రికార్డ్ విజయాన్ని అందుకుంది. 94 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే కని వినీ ఎరుగని విజయాన్ని కైవసం చేసుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.**

**టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే భారత్‌కు ఇది అతిపెద్ద విజయం. అయితే ఈ భారీ విజయంతో భారత్‌కు ఒరిగేదేం లేదు. ఆల్‌టైమ్ రికార్డ్ విజయాన్ని అందుకున్నా.. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో భారత్ స్థానం ఏ మాత్రం మారదు. ఎందుకంటే ఈ మ్యాచ్.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2025-27 సైకిల్‌లో భాగం కాదు.**

అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ప్రోత్సాహం అందించే ఉత్తిత్తి మ్యాచ్. దాంతోనే ఈ గెలుపుతో టీమిండియాకు ఉపయోగం లేకుండా పోయింది. డబ్ల్యూటీసీ 2025-27 పాయింట్స్ టేబుల్‌లో ప్రస్తుతం భారత్ 48.15 విన్నింగ్ పర్సంటేజ్‌తో ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సైకిల్‌లో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ 4 గెలిచి మరో నాలుగు ఓడింది. ఒక మ్యాచ్ డ్రా అయ్యింది. గతేడాది ఇంగ్లండ్ పర్యటనతో డబ్ల్యూటీసీ సైకిల్‌ను ప్రారంభించిన భారత్.. ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసుకుంది. ఆ తర్వాత వెస్టిండీస్‌తో సొంతగడ్డపై 2 టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. కానీ సొంతగడ్డపై సౌతాఫ్రికా చేతిలో 2-0తో క్లీన్ స్వీప్ అయ్యింది. ఈ ఘోర పరాజయంతో టీమిండియా డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్, బంగ్లాదేశ్.. భారత్ కంటే ముందు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ సైకిల్‌లో భారత్ ఇంకా 9 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. శ్రీలంకలో రెండు, న్యూజిలాండ్‌లో రెండు, సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల్లో టీమిండియా తలపడాలి. ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ ఈ 9 మ్యాచ్‌ల్లో కనీసం ఏడు గెలవాలి. న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా చివరిసారిగా 2009లో టెస్ట్ మ్యాచ్ గెలిచింది. అక్కడే జరిగే మ్యాచ్‌లు భారత జట్టుకు పెద్ద సవాల్‌గా మారనున్నాయి. ఈ 9 మ్యాచ్‌లకు సన్నాహకంగానే టీమిండియా అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడింది.



## నేను రిటైర్ కావాలనుకుంటున్నారా?: హర్మన్ ప్రీత్

మహిళల టీ20 ప్రపంచకప్ జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. టోర్నీ ఆరంభానికి సమయం దగ్గరపడటంతో ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇటీవల అన్ని జట్ల కెప్టెన్లతో ఫొటోషూట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించగా భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను విలేకరులు పలు ప్రశ్నలు అడిగారు. ఈ టీ20 ప్రపంచ కప్ మీకు చివరిది అవుతుందా అని ఓ రిపోర్టర్ హర్మన్‌ప్రీత్‌ను ప్రశ్నించారు. దీనికి ఆమె 'నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా" అని ఎదురు ప్రశ్న వేశారు. 'మీ ప్రణాళికలు గురించి తెలుసుకునేందుకే ఈ ప్రశ్న అడిగా. టీ20 నుంచి వైదొలగడానికి సమయం రాలేదని మీరు భావిస్తున్నందుకు సంతోషిస్తున్నాను' అని విలేకరి సమాధానమిచ్చారు. అయినప్పటికీ హర్మన్‌ప్రీత్ తగ్గలేదు. 'మరి అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు' అంటూ అసహనం వ్యక్తం చేశారు. హర్మన్‌ప్రీత్ సారథ్యంలో గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌ను భారత్ సాధించడంతో ఈ టీ20 వరల్డ్ కప్‌లో టీమ్‌ఇండియాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. బయటి నుంచి వచ్చే ఒత్తిడి గురించి ఎక్కువగా ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తానని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నారు. "విజయంతో (వన్డే వరల్డ్ కప్) సహజంగానే మరిన్ని అంచనాలు వస్తాయి. కానీ, మహిళల క్రికెట్‌కు ఇది సానుకూల సంకేతంగా నేను చూస్తున్నాను. మ్యాచ్‌ల విషయంలో ప్రజలు ఎంతో భావోద్వేగంతో ఉంటారు. వారు ఎప్పటికప్పుడూ మమ్మల్ని నిశితంగా పరిశీలిస్తారు. వ్యక్తిగతంగా నేను బయటినుంచి వచ్చే ఒత్తిడి గురించి ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. సన్నద్ధత, జట్టుకు సహకారం అందించడం, వర్తమానంలో ఏం జరుగుతుంది అనే దానిపైనే నా దృష్టి ఉంటుంది. భారీ అంచనాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇలాంటి సమయంలో బయటి విషయాలను పట్టించుకోకుండా నా ఆట పైనే ఫోకస్ ఉండేలా చూసుకోవాలి" అని హర్మన్‌ప్రీత్ వివరించారు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జూన్ 14న ఈ దాయాదుల పోరు జరగనుంది.



## మెక్సికోలోనే ఇరాన్ జట్టు

**ఫిఫా వరల్డ్ కప్‌లో వింత పరిస్థితి**

2026 ఫిఫా వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు, ఆతిథ్య దేశమైన అమెరికాలో అడుగుపెట్టకుండా సరిహద్దులోని మెక్సికో నగరమైన టిజువానాకు చేరుకుంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, వీసా నిబంధనల కారణంగా ఈ విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా తమ పట్ల వివక్ష చూపుతోందని, ఉద్దేశపూర్వకంగానే అడ్డంకులు సృష్టిస్తోందని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు మెహదీ తాజ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జూన్ 15న లాస్ ఏంజిల్స్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న మొదటి మ్యాచ్‌కు కేవలం ఒక్కరోజు ముందు మాత్రమే తమ ఆటగాళ్లకు వీసాలు జారీ చేశారని ఆయన తెలిపారు. సహాయక సిబ్బంది, మీడియా ప్రతినిధులు చాలామందికి ఇంకా వీసాలు రాలేదని, దీనిపై ఫిఫాకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ఒక అమెరికా అధికారి స్పందించారు.



## సుతార్ స్కిల్ అద్భుతం: సునీల్ గవాస్కర్

ఆఫ్ఘనిస్థాన్ తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ లో టీమిండియా యువ స్పిన్నర్ మానవ్ సుతార్ తన అరంగేట్రంతో అందరినీ ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్ లో కేవలం 33 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టిన ఈ 23 ఏళ్ల యువ ఆటగాడి బౌలింగ్‌కు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ముగ్ధుడయ్యారు. మానవ్ సుతార్ బౌలింగ్ కంట్రోల్ , అతని సింపుల్ యాక్షన్‌ను కొనియాడిన లిటిల్ మాస్టర్.. ఈ యువ బౌలర్ భారత క్రికెట్లో సుదీర్ఘ భవిష్యత్తును కలిగి ఉన్నాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండియాలో స్పిన్నర్లు సాధించే విజయాల వెనుక కేవలం ఇక్కడి టర్నింగ్ పిచ్‌ల సహకారమే ఉంటుందని విమర్శించే వారికి సునీల్ గవాస్కర్ గట్టి కౌంటర్ ఇచ్చారు. మ్యాచ్ బ్రాడ్‌కాస్టర్‌తో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. "భారత్‌లో స్పిన్నర్లకు పరిస్థితులు అనుకూలిస్తాయని, పిచ్ నుంచి సాయం లభిస్తుందని చాలా మంది అంటుంటారు. కానీ నేను చెబుతున్నాను.. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో పిచ్‌ను కాసేపు పక్కన పెట్టండి. బౌలింగ్ అంటే కేవలం నైపుణ్యం (స్కిల్), నియంత్రణ (కంట్రోల్).. ఈ యువ ఆటగాడు మైదానంలో సరిగ్గా అదే చేసి చూపించాడు" అని సునీల్ గవాస్కర్ ప్రశంసించారు. మానవ్ సుతార్ బౌలింగ్ యాక్షన్‌ను గవాస్కర్ ప్రత్యేకంగా విశ్లేషించారు. "మానవ్ సుతార్ బౌలింగ్ యాక్షన్ చాలా సాధారణంగా, సింపుల్‌గా ఉంటుంది. ఈ సింపుల్ యాక్షనే అతను వికెట్లపై అద్భుతమైన నియంత్రణతో, ఖచ్చితత్వంతో బౌలింగ్ చేయడానికి సహాయపడుతుంది. దీనివల్ల బ్యాటర్లను నిరంతరం ఒకే లైన్ అండ్ లెంగ్త్‌లో వేధిస్తూ, వారిపై ఒత్తిడి పెంచడంలో అతను విజయవంతమయ్యాడు" అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు.



## టాలెంట్ ఉన్నా పట్టించుకోలేదు: వైభవ్

ఐపీఎల్ వేలంపై రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్, యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వేలంలో తన కోసం రెండు జట్లే పోటీపడటం తనను తీవ్రంగా నిరాశపర్చిందని చెప్పాడు. తాజాగా రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన వీడియోలో వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని వెల్లడించాడు. 'నేను బాగా ఆడుతాను. ట్రయల్స్‌లోనూ బాగా పర్ఫార్మ్ చేశాను. అయినా వేలంలో నా కోసం రెండే జట్లే బిడ్ వేశాయి. మిగతా టీమ్స్ ఎందుకు పట్టించుకోలేదని నేను చాలా బాధపడ్డాను. కానీ రాజస్థాన్ రాయల్స్‌లోకి తీసుకొచ్చినందుకు ఈ ఏడాదిన్నర కాలంలో ఆ దేవుడికి కనీసం వెయ్యి సార్లయినా కృతజ్ఞతలు చెప్పుకుని ఉంటాను. ఇక్కడి కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్, ఆటగాళ్లు, మేనేజ్‌మెంట్, మీడియా టీమ్, ఫిజియోలు, ట్రైనర్లు.. అందరూ ఒక కుటుంబంలా ఉంటారు. ఇక్కడ ఉంటే మన సొంత ఇల్లులాగే ఎంతో సౌకర్యంగా అనిపిస్తుంది. ఎవరితోనైనా మన మనసులోని మాటను, భావాలను పంచుకోవచ్చు. ఈ ఫ్రాంచైజీలోకి వచ్చినందుకు నేను ఎంత సంతోషంగా ఉన్నానో మాటల్లో చెప్పలేను. జట్టులోని సీనియర్లు అందరూ నాకు ఎంతో మంచి మార్గదర్శకత్వం అందిస్తారు. ఏది మంచిది, ఏం చేయాలి, ఏం చేయకూడదు అని చెప్తారు. ఇక్కడ నేను నేర్చుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయి.'అని వైభవ్ సూర్యవంశీ ఆనందం వ్యక్తం చేశాడు.

## సీఎం విజయ్‌కు ప్రజ్ఞానంద చెక్!

చెన్నై: నార్వే చెస్ టైటిల్ గెలిచిన గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద.. అదే ఊపులో ఉన్నారు. ఇవాళ తమిళనాడు సీఎం విజయ్‌ని కూడా ప్రజ్ఞానంద ఓ గేమ్‌లో ఓడించారు. నార్వే టైటిల్ గెలిచిన సందర్భంగా సీఎం విజయ్‌ని ఆ రాష్ట్ర సెక్రటేరియేట్‌లో ప్రజ్ఞానంద కలిశారు. ఆ సమయంలో ఇద్దరూ కాసేపు సరదాగా చెస్ ఆడారు. అయితే కేవలం కొన్ని ఎత్తుల్లోనే సీఎం విజయ్‌కు గ్రాండ్‌మాస్టర్ చెక్ పెట్టేశారు. చెస్ స్టార్ ప్రజ్ఞానందకు 50 లక్షల ప్రత్యేక నజరానా సీఎం అందజేశారు. అయితే సీఎం విజయ్ చెస్ ఆడిన తీరును ప్రజ్ఞానంద మెచ్చుకున్నారు. సీఎంతో చెస్ ఆడడం అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందన్నాడు. విజయ్, ప్రజ్ఞానంద చెస్ ఆడిన విలువల్స్‌ను రిలీజ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నగదు పురస్కారం తనలో ప్రేరణ ఇస్తోందన్నారు. సీఎం విజయ్ చెస్ ఆడుతారన్న సంగతి తనకు తెలియదని, చెస్ బోర్డు తెమ్మన్నారని, టేబుల్‌పై చెస్ ఆడామని ప్రజ్ఞానంద తెలిపారు. తన స్నేహితులతో కలిసి చెస్ ఆడేవాడినని సీఎం విజయ్ చెప్పినట్లు తెలిపారు. గేమ్ నేనే గెలిచినా, సీఎం బాగా ఆడారని అన్నాడు.



నేటి ఈవార్తలు

# సంపాదకీయం Editorial

## భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లు

భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరించినప్పటికీ, ప్రస్తుతం మరో కీలక జనాభా మార్పును ఎదుర్కొంటోంది. దేశంలో జననాల రేటు క్రమంగా తగ్గుతూ ఉండటం భవిష్యత్ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఒకప్పుడు జనాభా విస్ఫోటనం ప్రధాన సమస్యగా చర్చకు వచ్చిన భారత్‌లో, ఇప్పుడు జననాల రేటు క్షీణత కొత్త ఆందోళనలకు కారణమవుతోంది. ఇది కేవలం జనాభా గణాంకాల మార్పు మాత్రమే కాదు; దేశ భవిష్యత్ అభివృద్ధి దిశను నిర్దేశించే కీలక అంశం. విద్యా స్థాయి పెరగడం, మహిళల ఉద్యోగ అవకాశాలు విస్తరించడం, పట్టణీకరణ, జీవన వ్యయాలు అధికం కావడం వంటి కారణాలతో కుటుంబాలు తక్కువ మంది పిల్లలను కలిగి ఉండటానికి మొగ్గు చూపుతున్నాయి. ఒకప్పుడు నాలుగు లేదా ఐదుగురు పిల్లలు సాధారణంగా కనిపించే కుటుంబాల్లో ఇప్పుడు ఒకరు లేదా ఇద్దరు పిల్లలతోనే పరిమితమవుతున్నారు. ఫలితంగా దేశంలోని మొత్తం సంతానోత్పత్తి రేటు అనేక రాష్ట్రాల్లో భర్తీ స్థాయి కంటే దిగువకు చేరుకుంది. జననాల రేటు తగ్గడం తక్షణంగా ప్రయోజనకరంగానే కనిపించవచ్చు. కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంది. పిల్లల విద్య, ఆరోగ్యం, పోషణపై ఎక్కువ శ్రద్ధ పెట్టే అవకాశం ఉంటుంది. అయితే దీర్ఘకాలంలో ఈ పరిస్థితి దేశ ఆర్థిక వ్యవస్థకు సంక్లిష్టమైన సవాళ్లను సృష్టించవచ్చు. ముఖ్యంగా పని చేసే వయస్సు గల జనాభా క్రమంగా తగ్గడం వల్ల పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగాలకు అవసరమైన మానవ వనరుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.దమరోవైపు వృద్ధుల జనాభా శాతం పెరుగుతుంది. ప్రస్తుతం యువ జనాభా భారత్‌కు ప్రధాన బలంగా ఉన్నప్పటికీ, రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ఆరోగ్య సంరక్షణ, పెన్షన్ వ్యవస్థలు, సామాజిక భద్రత పథకాలపై ప్రభుత్వ వ్యయం మరింత పెరుగుతుంది. పనిచేసే యువత సంఖ్య తగ్గితే పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గి, వృద్ధుల సంక్షేమానికి అవసరమైన నిధులను సమకూర్చడం ప్రభుత్వాలకు సవాలుగా మారవచ్చు. ప్రపంచంలోని కొన్ని అభివృద్ధి చెందిన దేశాల అనుభవం ఈ విషయంలో హెచ్చరికగా నిలుస్తోంది. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ వంటి దేశాలు తక్కువ జననాల రేటు కారణంగా వృద్ధ జనాభా సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఆర్థిక వృద్ధి మందగించడం, కార్మికుల కొరత, సంక్షేమ వ్యయాల పెరుగుదల వంటి సమస్యలు అక్కడ స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారత్ కూడా ముందస్తు ప్రణాళికలు లేకపోతే ఇదే పరిస్థితిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అయితే జననాల రేటు తగ్గుదలను కేవలం సమస్యగా చూడటం కూడా సరైంది కాదు. జనాభా సంఖ్య కంటే జనాభా నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది. నైపుణ్యాభివృద్ధి, విద్య, ఆరోగ్య రంగాల్లో పెట్టుబడులు పెంచి తక్కువ సంఖ్యలో ఉన్న యువతను మరింత ఉత్పాదక శక్తిగా మార్చగలిగితే ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది. అలాగే మహిళల ఉపాధి భాగస్వామ్యాన్ని పెంచడం, వృద్ధులకు సమగ్ర సామాజిక భద్రత కల్పించడం, కుటుంబాలకు అనుకూల విధానాలను అమలు చేయడం ద్వారా భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చు. జననాల రేటు తగ్గుదల ఒక గణాంకం మాత్రమే కాదు; అది దేశ భవిష్యత్తుకు సంబంధించిన హెచ్చరిక. యువ జనాభా అనే వరాన్ని సద్వినియోగం చేసుకుంటూనే వృద్ధ సమాజం వైపు అడుగులు వేస్తున్న వాస్తవాన్ని గుర్తించి ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, సమాజం సమిష్టిగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. సరైన ప్రణాళికలు ఉంటే ఈ మార్పును సంక్షోభంగా కాకుండా అవకాశంగా మలచుకోవచ్చు. లేకపోతే నేటి జనాభా లాభం రేపటి ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది.

## మారుతున్న ప్రజాస్వామ్య స్వరూపం

ఒకప్పుడు ఉద్యమం అంటే వీధుల్లోకి రావడం, సభలు నిర్వహించడం, కరపత్రాలు పంచడం, ప్రజలను ప్రత్యక్షంగా కలవడం అనే భావన ఉండేది. అయితే సాంకేతిక విప్లవం, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరగడంతో ప్రజాస్వామ్య పోరాటాల స్వరూపం కూడా మారిపోయింది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలు యువతకు కొత్త ఆయుధాలుగా మారాయి. నేడు ఒక హ్యాష్‌ట్యాగ్, ఒక వీడియో, ఒక పోస్ట్ లేదా ఒక ట్వీట్ లక్షలాది మందిని ప్రభావితం చేయగలుగుతోంది. ఫలితంగా డిజిటల్ యాక్టివిజం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక శక్తివంతమైన భాగంగా ఎదుగుతోంది. ఈ మార్పు యువతకు అపార అవకాశాలను అందిస్తున్నప్పటికీ, అదే సమయంలో కొన్ని ప్రమాదాలను కూడా ముందుకు తెస్తోంది. భారత్ ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఈ యువతలో ఎక్కువ మంది సోషల్ మీడియా వేదికలను రోజువారీ జీవితంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా సమాచార మార్పిడి, చర్చలు, అభిప్రాయాల వ్యక్తీకరణ, సామాజిక చైతన్యానికి కేంద్రాలుగా మారాయి. గతంలో సంప్రదాయ మీడియా ద్వారా మాత్రమే ప్రజలకు చేరుకునే అంశాలు ఇప్పుడు నేరుగా యువత చేతుల్లోకి వస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యాన్ని మరింత భాగస్వామ్య ప్రక్రియగా మార్చింది.



సోషల్ మీడియా యువతకు తమ గొంతును వినిపించే అవకాశం కల్పించింది. ఒక సామాజిక అన్యాయం, అవినీతి ఘటన, పర్యావరణ సమస్య లేదా విద్యా రంగంలోని లోపం వంటి అంశాలపై యువత వేగంగా స్పందించగలుగుతోంది. కొన్ని సందర్భాల్లో సోషల్ మీడియా ప్రచారాలు ప్రభుత్వాలను నిర్ణయాలు మార్చుకునేలా కూడా చేశాయి. మహిళల భద్రత, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై డిజిటల్ వేదికల ద్వారా ప్రారంభమైన చర్చలు విస్తృత ప్రజా ఉద్యమాలుగా మారిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందనడానికి ఇవి నిదర్శనం. అయితే ఈ మార్పును పూర్తిగా సానుకూలంగా మాత్రమే చూడలేం. సోషల్ మీడియా వేగం ఎంత ఎక్కువగా ఉంటుందో, అపోహలు వ్యాప్తి చెందే ప్రమాదం కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. వాస్తవాలను ధృవీకరించకుండా పంచే సమాచారం, తప్పుడు వార్తలు, ద్వేషపూరిత ప్రచారాలు సమాజంలో విభేదాలను పెంచే అవకాశం ఉంది. ఒకప్పుడు ఉద్యమాలు వాస్తవ సమస్యల చుట్టూ రూపుదిద్దుకునేవి. ఇప్పుడు కొన్నిసార్లు భావోద్వేగాలు, అసంపూర్ణ సమాచారం లేదా ప్రచారాల ఆధారంగా కూడా ఉద్యమాలు ఉద్భవిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య చర్చల నాణ్యతను దెబ్బతీసే ప్రమాదాన్ని కలిగి ఉంది. డిజిటల్ యాక్టివిజంలో మరో ముఖ్యమైన సమస్య 'స్లాక్టివిజం'. అంటే సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను లైక్ చేయడం, షేర్ చేయడం లేదా హ్యాష్‌ట్యాగ్ ఉపయోగించడం ద్వారా తమ బాధ్యత పూర్తయిందని భావించే ధోరణి. నిజమైన సామాజిక మార్పు కోసం కేవలం ఆన్‌లైన్ మద్దతు సరిపోదు. ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం, విధానాలపై అవగాహన, నిరంతర కృషి, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాల్గొనడం కూడా అవసరం. లేకపోతే డిజిటల్ ఉద్యమాలు తాత్కాలిక ప్రచారాలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

యువత ఉద్యమాలు ప్రజాస్వామ్యానికి బలంగా మారాలంటే బాధ్యతాయుత వినియోగం అత్యంత అవసరం. ఏ సమాచారాన్నైనా పంచే ముందు దాని నిజానిజాలను పరిశీలించడం, విభిన్న అభిప్రాయాలను గౌరవించడం, వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండటం, చట్టబద్ధ మార్గాల్లో అభిప్రాయాలను వ్యక్తపరచడం వంటి అంశాలు కీలకం. ప్రజాస్వామ్యం అంటే కేవలం స్వేచ్ఛ మాత్రమే కాదు; ఆ స్వేచ్ఛను బాధ్యతతో వినియోగించే సంస్కృతి కూడా. సోషల్ మీడియా వేదికలు యువతకు శక్తిని ఇచ్చాయి. అయితే ఆ శక్తి సమాజ నిర్మాణానికి ఉపయోగపడాలే గానీ, విభజనలకు లేదా అపోహల వ్యాప్తికి కారణం కాకూడదు. ప్రస్తుత కాలంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలు కూడా సోషల్ మీడియా ప్రభావాన్ని గుర్తిస్తున్నాయి. ఎన్నికల ప్రచారాల నుంచి ప్రజా విధానాల వరకు ప్రతీ అంశంలో డిజిటల్ వేదికల పాత్ర పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యువత కేవలం ప్రేక్షకులుగా కాకుండా ప్రజాస్వామ్య నిర్మాణంలో చురుకైన భాగస్వాములుగా మారుతున్నారు. వారి స్పందనలు, అభిప్రాయాలు, ఉద్యమాలు ప్రభుత్వాల నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. ఇది ప్రజాస్వామ్య వికాసానికి సానుకూల సంకేతమే. అయితే డిజిటల్ యుగంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే డిజిటల్ అక్షరాస్యతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. యువతకు సమాచారాన్ని విశ్లేషించే సామర్థ్యం, తప్పుడు వార్తలను గుర్తించే నైపుణ్యం, బాధ్యతాయుత ఆన్‌లైన్ ప్రవర్తనపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యా సంస్థలు, మీడియా సంస్థలు, ప్రభుత్వాలు ఈ దిశగా మరింత చురుకుగా పనిచేయాలి.

సోషల్ మీడియా యుగంలో యువత ఉద్యమాలు ప్రజాస్వామ్యానికి కొత్త రూపాన్ని ఇస్తున్నాయి. అవి ప్రజల స్వరాన్ని వేగంగా వినిపించే సాధనాలుగా, సామాజిక మార్పుకు ప్రేరక శక్తులుగా నిలుస్తున్నాయి. కానీ ఈ శక్తి బాధ్యతతో కూడినదిగా ఉండాలి. డిజిటల్ ప్రపంచం అందించిన అవకాశాలను సమాజ అభ్యున్నతికి వినియోగించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. లేకపోతే అదే వేదికలు అపోహలు, విభేదాలు, అసహనానికి కారణమయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల సోషల్ మీడియా యుగంలో యువత చేతుల్లో ఉన్న ఈ కొత్త శక్తి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే సాధనంగా మారాలంటే చైతన్యంతో పాటు బాధ్యత కూడా అనివార్యం.



రణధీర్ గుండు

సమాజంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం కేవలం కుటుంబ సమస్య మాత్రమే కాదు; ఇది సామాజిక, ఆర్థిక, మానసిక, సాంస్కృతిక మార్పులకు అద్దం పట్టే గంభీరమైన పరిణామం. ఒకప్పుడు తల్లిదండ్రులను దేవుళ్లతో సమానంగా భావించిన భారతీయ కుటుంబ వ్యవస్థలో నేడు కొన్ని చోట్ల విరుద్ధ దృశ్యాలు కనిపిస్తున్నాయి. పేదరికంలో పెరిగిన పిల్లలు ఉన్నత విద్య, ఉద్యోగాలు, సంపద సాధించిన తర్వాత తమ ఎదుగుదలకు కారణమైన తల్లిదండ్రుల త్యాగాలను మరచిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఒక తండ్రి కూలి పని చేస్తూ, ఒక తల్లి కష్టనష్టాలు భరిస్తూ పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి చేర్చుతారు. అయితే కొందరు పిల్లలు ఎదిగిన తర్వాత తమ తల్లిదండ్రుల నిరాడంబర జీవనాన్ని చూసి సంకోచించడం, వారిని సామాజికంగా దూరం పెట్టడం వంటి సంఘటనలు కనిపిస్తున్నాయి.



## తల్లిదండ్రుల త్యాగాలను గుర్తించని తరం!



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ఈ పరిస్థితి వెనుక వ్యక్తిగత స్వభావంతో పాటు ఆధునికీకరణ, పట్టణీకరణ, వినియోగవాద సంస్కృతి, సామాజిక ప్రతిష్ఠ కోసం పోటీ వంటి అనేక కారణాలు ఉన్నాయి. వృద్ధులపై జరిగిన అధ్యయనాలు కూడా ఆందోళనకరమైన వాస్తవాలను వెల్లడిస్తున్నాయి. భారతదేశంలో గణనీయమైన సంఖ్యలో వృద్ధులు నిర్లక్ష్యం, మానసిక వేధింపులు, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. అనేక సందర్భాల్లో బాధ్యులు సొంత పిల్లలేనని పరిశోధనలు సూచిస్తున్నాయి. వృద్ధాప్యంలో వారికి అత్యంత అవసరమైన ప్రేమ, గౌరవం, ఆదరణ కొరవడుతోంది.

సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి సామాజిక స్థాయి మార్పు. పేదరికంలో పెరిగిన వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత తన విజయానికి పూర్తిగా తానే కారణమని భావించే ధోరణి పెరుగుతుంది. తల్లిదండ్రుల త్యాగాలను సహజ బాధ్యతగా మాత్రమే చూస్తాడు. ఫలితంగా కృతజ్ఞతా భావం తగ్గిపోతుంది. కొందరిలో గత పేదరికాన్ని గుర్తు చేసే ప్రతి అంశాన్ని దూరం పెట్టాలనే మానసిక ప్రవృత్తి కూడా కనిపిస్తుంది. ఆ క్రమంలో గ్రామం, బాల్యమిత్రులు, చివరకు తల్లిదండ్రులే దూరమవుతారు. ప్రపంచీకరణ, వ్యక్తికేంద్రిత జీవన విధానం కూడా ఈ పరిస్థితిని ప్రభావితం చేస్తున్నాయి. "నా కెరీర్, నా లక్ష్యం, నా విజయం" అనే భావనలు బలపడుతున్నాయి. కుటుంబం, బంధుత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలు వెనుకబడుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, విదేశీ అవకాశాల కారణంగా పిల్లలు దూర ప్రాంతాల్లో స్థిరపడుతున్నారు. భౌతిక దూరం పెరగడంతో భావోద్వేగ దూరం కూడా పెరుగుతోంది. కొందరు నెలకు కొంత డబ్బు పంపడమే తమ బాధ్యతగా భావిస్తున్నారు. వృద్ధుల సంక్షేమ సంస్థల నివేదికల ప్రకారం, అనేక మంది వృద్ధులు తమ జీవితంలో అత్యంత బాధాకరమైన అనుభవంగా పిల్లల నిర్లక్ష్యాన్నే పేర్కొంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కంటే ఒంటరితనం, ప్రేమాభావమే వారిని ఎక్కువగా బాధిస్తోంది. జీవితమంతా పిల్లల కోసం త్యాగం చేసిన తల్లిదండ్రులకు ఈ నిర్లక్ష్యం మరింత వేదన కలిగిస్తోంది.

భారతీయ సంస్కృతిలో "మాతృదేవో భవ, పితృదేవో భవ" అనే భావనకు అత్యున్నత స్థానం ఉంది. తల్లి జీవితం ఇస్తుంది, తండ్రి భవిష్యత్తు నిర్మిస్తాడు. అలాంటి తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం కేవలం కుటుంబ వైఫల్యం మాత్రమే కాదు, సంస్కృతి వైఫల్యంగా కూడా చూడాలి. ఉమ్మడి కుటుంబాల స్థానంలో అణు కుటుంబాలు రావడం, వలసలు పెరగడం, జీవనశైలి మార్పులు ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. అయితే మొత్తం యువతను విమర్శించడం సరైంది కాదు. నేటికీ లక్షలాది మంది పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకుంటున్నారు. వారి ఆరోగ్యం, సౌకర్యాలు, ఆనందం కోసం శ్రమిస్తున్నారు. కానీ పెరుగుతున్న ప్రతికూల ధోరణిని గుర్తించి చర్చించడం అవసరం. ఎందుకంటే కుటుంబ బంధాలు బలహీనపడితే సమాజం కూడా బలహీనపడుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసే త్యాగాలకు విలువ కట్టడం అసాధ్యం. వారు ఖర్చు చేసిన డబ్బుకు ధర ఉండవచ్చు; కానీ వారు వెచ్చించిన ప్రేమకు ధర ఉండదు. వారు కోల్పోయిన నిద్రను, భరించిన కష్టాలను కొలవలేం. అందుకే తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత చూపడం ప్రతి సంతానం యొక్క ప్రాథమిక ధర్మం. నేడు తల్లిదండ్రులను గౌరవించే కుటుంబాల్లోనే రేపటి తరం కూడా అదే విలువలను నేర్చుకుంటుంది.

ఈ సమస్యకు పరిష్కారం కేవలం చట్టాల్లో లేదు. విలువలతో కూడిన విద్య, కుటుంబ బంధాల ప్రాముఖ్యతపై అవగాహన, చిన్నప్పటి నుంచే కృతజ్ఞతా భావం పెంపొందించడం అవసరం. పాఠశాలలు, కళాశాలలు, మాధ్యమాలు, మత మరియు సామాజిక సంస్థలు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలి. వృద్ధుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; ప్రతి కుటుంబం స్వీకరించాల్సిన సామాజిక బాధ్యత కూడా. ఒక వ్యక్తి విజయాన్ని కేవలం సంపద, పదవి, అధికారంతో కొలవలేం. అతను తన తల్లిదండ్రులతో ఎలా ప్రవర్తిస్తున్నాడు, వారి వృద్ధాప్యాన్ని ఎంత గౌరవప్రదంగా మార్చుతున్నాడు అన్నది కూడా అతని వ్యక్తిత్వానికి కొలమానం. ప్రపంచంలో ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మరచిపోకూడదు. చెట్టు ఎంత ఎత్తుకు పెరిగినా దాని బలం వేర్లలోనే ఉంటుంది. అలాగే మనిషి జీవితానికి నిజమైన పునాది తల్లిదండ్రులే. తల్లిదండ్రుల చెమటతో నిర్మించిన విజయ భవనంలో నివసిస్తూ వారినే నిర్లక్ష్యం చేయడం మానవత్వానికి మచ్చ. తల్లిదండ్రుల ప్రేమను గౌరవించలేని సంపద నిరర్థకం; ఆ బంధాన్ని కాపాడలేని విజయం అసంపూర్ణం. సమాజం నిజమైన అభివృద్ధి సాధించాలంటే ఆర్థిక పురోగతితో పాటు కుటుంబ విలువలు, కృతజ్ఞత, మానవత్వం కూడా సమానంగా పెరగాలి. అప్పుడు మాత్రమే అభివృద్ధి చెందిన, విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించగలుగుతాము.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.